


# నవభూమి

## జిల్లా అనుబంధం

03 ఏప్రిల్,2025 గురువారం పేజీలు:11

www.epaper.navabhoomi.in


## రామవరం మాత శిశువు

# గొంతెండుతోంది







**కొత్తగూడెం ఏప్రిల్ 2 నవభూమి ప్రతినిధి:** కొత్తగూడెం లో గత ప్రభుత్వం హయాంలో అప్పటి ఎమ్మెల్యే జలగం వెంకటరావు సూచనతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన రామవరం మాత శిషు ఆసుపత్రి మంచి నీటి ఎద్దడితో అల్లాడుతోంది. దానిపై సరైన అజమాయిషీ లేక, కొందరు నాయకుల పెత్తనంలో ప్రస్తుతం ఆసుపత్రి నలిగిపోతోంది. సిఎస్సార్ నిధులతో దాదాపు రూ.20 లక్షల వ్యయంతో 2022 మేలో పాల్వంచ నవ వెంచర్స్ లిమిటెడ్ ఆర్ ఓ వాటర్ ప్లాంట్, సెంట్రల్ ఆక్సిజన్ సిస్టం ఏర్పాటు చేసింది. దాన్ని అప్పటి కలెక్టర్ అనుదీప్ ప్రారంభించారు. అయితే సరైన పర్యవేక్షణ లేక ఆర్ ఓ వాటర్ ప్లాంట్ మూలన పడింది. గత వారం రోజులుగా ఆసుపత్రి లో తాగడానికి మంచినీళ్ళు లేవు. ఔట్ పేషంట్ లు, ఇన్ పెషేంట్లు మంచి నీళ్ల బాటిల్లు కొనుక్కుని తాగుతున్నారు. అయిన ఎవరికీ పెద్దగా పట్టింపు లేదు. దీనితో రామవరం మాత శిశు ఆసుపత్రిలో రోగులకి ఖిద్మతే ఇన్సానియత్ ట్రస్ట్ వాళ్లు చల్లటి నీటిని ఏర్పాటు చేశారు. ఇన్ పెషేంట్ల అటెండెంట్లు మంచినీళ్ల కోసం కిందకు పైకి తిరగాల్సి వస్తుంది. అసలే ఎండాకాలం, కొత్తగూడెం అంటేనే ఎండలకు ఫేమస్.. ఇటువంటి చోట మంచినీళ్లు లేకపోవడం సిగ్గు చేటని పలువురు విమర్శిస్తున్నారు. లోన నీళ్లు లేకపోవడంతో పెషేంట్ల సంబంధీకులు నీటికోసం చక్కర్లు కొడుతున్నారు. కాగా ఆసుపత్రి సూపరింటెండెంట్ వివరణ కోసం ఫోన్ ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.కనీసం ఆసుపత్రి లో ప్రైవేట్ ఆర్ ఓ ప్లాంట్ అయినా పెట్టించి చల్లని నీరు కొంత డబ్బులు చెల్లించికొనుక్కునే విధంగా అయిన ఏర్పాటు చేయాల్సి ఉంది. నీళ్లు అందుబాటులో లేకపోవడం వల్ల ఒక్కొక్కరు కనీసం 2 నుండి మూడు బాటిల్ ప్యాకెడ్ వాటర్ బాటిల్ ఒక్కొక్కటి రూ.20 కి బయట షాప్స్ నుండి కొనుగోలు చేస్తున్నారు. కాగా తరచూ విద్యుత్ అంతరాయంతో బాలింతలు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు.

## రాజీవ్ యువ వికాసం పథకాన్ని అభ్యర్థులు

# సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- రాజీవ్ యువ వికాసం, సన్న బియ్యం సరఫరాపై మీడియా సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్





**ఖమ్మం, నవభూమి బ్యూరో, ఏప్రిల్ 02:** రాజీవ్ యువ వికాసం పథకాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి రాజీవ్ యువ వికాసం, సన్న బియ్యం సరఫరాపై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఏప్రిల్ 14 వరకు రాజీవ్ యువ వికాసం పథకం కోసం ఆన్ లైన్ లో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని లేదా ఎంపీడీవో కార్యాలయం, మున్సిపల్ కార్యాలయ అధికారుల వద్ద దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 50 వేల నుంచి 4 లక్షల రూపాయల వరకు సబ్సిడీ యూనిట్లు లభిస్తాయని అన్నారు. అభ్యర్థులకు వ్యవసాయేతర యూనిట్లకు 21 నుంచి 55 ఏళ్ళ వయస్సు ఉండాలని, వ్యవసాయ యూనిట్లకు 60 సంవత్సరాల వరకు సడలింపు ఉందని కలెక్టర్ తెలిపారు. ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్ లేదా ఆధాయ ధృవీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రంతో కలిపి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అభ్యర్థులకు అవసరమైన సర్టిఫికెట్లు వెంటనే 3 రోజులలో జారీ చేసేలా తహసీల్దార్ లకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. మండల జనాభా, గ్రామ జనాభా అనుగుణంగా కేటాయించిన లక్ష్యాల ప్రకారం యూనిట్లను మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. స్క్రూటినీ యూనిట్ లో స్పెషలిస్ట్ అధికారులను సైతం ఉంచుతామని అన్నారు. సెక్టార్ వారీగా అభ్యర్థులకు అవసరమైన శిక్షణ కూడా అందించడం జరుగుతుందని అన్నారు. డాక్యుమెంట్ కారణంగా ఎవరికి యూనిట్ ఆపడం జరగదని కలెక్టర్ తెలిపారు. బ్యాంక్ లింకేజీ రుణాలు కూడా తప్పనిసరిగా మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. బ్యాంకు లింకేజీ రుణాలు అనవసరంగా తిరస్కరించడానికి వీలు లేదని అన్నారు. అభ్యర్థులకు అవసరమైన శిక్షణ అందించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. ప్రతి రేషన్ షాపులో తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు ఉచితంగా సన్న రకం బియ్యం సరఫరా చేయడానికి చర్యలు చేపట్టామని అన్నారు. రేషన్ డీలర్ల ఓనర్ షిప్ రీ-వెరిఫికేషన్ చేస్తామని, సరిగ్గా పని చేయని రేషన్ డీలర్లపై తప్పనిసరిగా చర్యలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు.

రేషన్ బియ్యం పక్కదారి పట్టడానికి వీలు లేకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. లబ్దిదారులకు ఎవరైనా సన్న బియ్యం కాకుండా నాణ్యత లేని బియ్యం అందిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో డిఆర్డీవో సన్యాసయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఇంచార్జ్ ఇడి నవీన్ బాబు, జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎన్ విజయలక్ష్మీ, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి డా. బి. పురంధర్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జి. శ్రీలత, ప్రింట్, ఎలెక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థిక స్వావలంభన కలిగి ఉంటే

# వ్యాపారాభివృద్ధి సాధిస్తారు

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- వేసవి కాలానుగుణంగా పరిస్థితులను బట్టి వ్యాపారాలను విస్తరించుకోవాలి
- అందించిన తోడ్పాటు అవకాశాలను ఉపయోగించుకొని పదిమందికి ఉపాధి ఇవ్వాలి
- అప్పటి నుండి ఇప్పటి వరకు నాణ్యత, టీ రుచిలో ఏలాంటి లోటులేదు చెల్లెమ్మ అంటూ కితాబుచ్చిన జిల్లా కలెక్టర్








**ఖమ్మం నవభూమి బ్యూరో, ఏప్రిల్02:** ప్రజలలో నమ్మకం కలిగిస్తూ నాణ్యతను పెంచుతూ వ్యాపారాలను విస్తరించుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆకాంక్షించారు. ఖమ్మం జిల్లా సమీకృత కార్యాలయం బస్ స్టాప్ సెంటర్ లోని ఇందిరా మహిళా శక్తి స్త్రీ టీ స్టాల్ ను బుధవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సందర్శించారు. స్త్రీ టీ స్టాల్ నిర్వహకురాలని కలెక్టర్ పలకరించారు. రోజు కలెక్టరేట్ కు వస్తూ, పోతూ చూస్తున్నాను జనం ఉంటూన్నారు. వ్యాపారం మంచిగా నడుస్తుందా, వేసవి కాలం దృష్ట్యా వ్యాపార అభివృద్ధిలో భాగంగా బటర్ మిల్క్, లెమన్ వాటర్, మిల్క్ షేక్, ఫాలుదా, పండ్ల రసాలు వంటివి విక్రయించేందుకు గల అవకాశాలు పరిశీలించుకోవాలని కలెక్టర్ సూచించారు. పాల ఉత్పత్తులతో నాణ్యమైన లస్సీ తయారు చేసి అమ్మితే అధిక లాభాలు వస్తాయని, ఆ దిశగా ఆలోచనలు చేయాలని కలెక్టర్ సలహా ఇచ్చారు. నూతనంగా వివిధ రకాల చల్లని ఐస్ క్రీమ్ లు, కూల్ డ్రింక్స్ ఏర్పాటు చేశారు సంతోషం అని, ప్రజలకు నాణ్యమైన పదార్థాలు విక్రయిస్తూ మంచి లాభాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ప్లాస్టిక్ వస్తువులను నిర్మూలిస్తూ ప్రస్తుత ఉన్న కాలాన్ని అనుగుణంగా ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని నాణ్యతను కొనసాగిస్తూ, నమ్మకాన్ని పెంచుకోవాలని సూచించారు. ఉపాధి పొందడమే కాక ఆర్థిక బలంతో పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. టీ స్టాల్ నిర్వహకురాలి కోరిక మేరకు కలెక్టర్ టీ సేవించారు. అప్పటి నుండి ఇప్పటి వరకు చాయ్ ని ఆదే నాణ్యతను, రుచి కొనసాగిస్తున్నందుకు ప్రశంసిస్తూ.. అద్భుతమైన రుచితో టీ బాగుంది చెల్లెమ్మ అంటూ కలెక్టర్ కితాబు ఇచ్చారు. మహిళలు ఆర్థికంగా బలపడాలనే సంకల్పంతో ఇందిరా మహిళా శక్తిలో భాగంగా స్త్రీ టీ స్టాల్స్ ను మరిన్ని ఖమ్మంలో నెలకొల్పి మహిళలను ప్రోత్సహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి యూనిట్లను నిరంతరం పర్యవేక్షణ చేస్తూ స్త్రీ టీ క్యాంటీన్ మంజూరు చేసి నిర్వాకులకు వ్యాపారంలో తోడుగా అధికారులు ఉంటున్నారని అన్నారు. యూనిట్ కేటాయించాక ఏ మేరకు లాభాలు ఉంటాయనే అంశంతో పాటు వాటి నిర్వహణ, లాభాలను అంచనా వేస్తున్నామని అన్నారు. మహిళలు స్వయం ఉపాధి పొందాలనే ఉద్దేశ్యంతో స్త్రీ టీ క్యాంటీన్లు ఖమ్మం బ్యాండ్ ఉండే విధంగా ఏర్పాటు చేశామని అన్నారు. ప్రభుత్వం తరపున యూనిట్ గ్రౌండ్ చేసి, స్థల గుర్తింపు, ఏమేం అమ్మాలి, నాణ్యతపై క్షుణ్ణంగా చర్చించి , శిక్షణ ఇప్పించాకే వారికి అర్థిక సహాయం అందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు

# భద్రాద్రికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- మూడు హెల్ ప్యాడ్‌లను సిద్ధం చేస్తున్న అధికారులు
- శ్రీ సీతారామ చంద్ర స్వామి కళ్యాణ వేడుకలు విజయవంతానికి అధికారులతో సమీక్ష
- పాల్గొన్న దేవాదాయ కమిషనర్ శ్రీధర్, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటిడిఏ పీఓ రాహుల్



**ఎం రామాచారి / భద్రాచలం ఏప్రిల్ 2 నవభూమి ప్రతినిధి:** శ్రీ సీతారామ చంద్రస్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని వీక్షించడానికి భద్రాచలానికి పెద్దఎత్తున భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్నందున భక్తులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా అన్ని శాఖల అధికారులు వారికి అప్పగించిన పనులను బాధ్యతగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్ అన్నారు. బుధవారం నాడు భద్రాచలంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవ వేడుకలు విజయవంతం అవ్వడానికి సంబంధిత శాఖల అధికారుల తరఫున జరుగుతున్న ఏర్పాట్లపై శాఖల వారీగా ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత వైభవోపేతంగా ఎక్కడా లేని విధంగా సీతారాముల వారి కళ్యాణం జరిగేటువంటి పవిత్ర స్థలం మన భద్రాచలం పుణ్యక్షేత్రమని అన్నారు. ఈ క్షేత్రంలో కొన్ని దశాబ్దాల తరబడి సీతారాముల వారి కళ్యాణం ఆనవాయితీగా జరుగుతున్నదని తెలిపారు. కళ్యాణ మహోత్సవాన్ని ప్రత్యేకంగా కానీ పరోక్షంగా వీక్షించిన భక్తులకు ఎంతో పుణ్యం వస్తుందని వేదాల్లో చెప్పడం జరిగిందని అన్నారు. పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్నందున పూర్తి స్థాయిలో భక్తులకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మంచినీరు, చలువ పందిళ్లు, వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ఫాగ్ లిస్ట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు కళ్యాణ వేడుకలు వీక్షించేందుకు 26 సెక్టార్లు ఏర్పాటుతో పాటు ప్రతి సెక్టార్ లో ఎల్ ఈ డి టివిలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కళ్యాణ వేడుకలకు విచ్చేయు భక్తులకు స్వామి వారి కళ్యాణ వేడుకలు వీక్షించి జన్మ జన్మల పుణ్యాన్ని పొందేలా అధికారులు కృషి చేయాలని ఆయన అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణం పట్టాభిషేకం మహోత్సవాన్ని పురస్కరించుకొని దేవస్థానం తరపున మార్చి 30 నుండి ఏప్రిల్ 12 వ తారీకు వరకు బ్రహ్మోత్సవాలు ప్రారంభమైనాయని, కళ్యాణం జరిగే ముందు రోజు స్వామివారి ఎదుర్కోళ్ల కార్యక్రమం ఉంటుందని, భక్తుల సౌకర్యార్థం 75 శాతం ఆన్లైన్లో టికెట్లు అందుబాటులో ఉంచామని, భక్తులకు లడ్డు ప్రసాదంతో పాటు మహా ప్రసాదం కూడా అందించడానికి ప్రణాళికలు రూపొందించామని, తలంబ్రాల కౌంటర్లు 80 వరకు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి ఆర్టీసీ బస్సులో భక్తులకు కేజీ చొప్పున తలంబ్రాలు అందిస్తున్నామని, సేవల ద్వారా ఆర్టీసీ, పోస్ట్ ఆఫీస్ ద్వారా బుక్ చేసుకున్న వారికి ఇండియన్ ప్రకారం అందిస్తామని అన్నారు. సీఎం రాక కోసం మూడు హెలిప్యాడ్లను సిద్ధం చేస్తున్నామని, ఆర్డబ్ల్యూఎస్ మెడికల్ డిపార్ట్మెంట్ ద్వారా అక్కడ అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, కళ్యాణం, పట్టాభిషేకం జరిగే రెండు రోజులు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని, జనరేటర్ ను కూడా మిథిలా స్టేడియంలో అందుబాటులో ఉంచుకుంటున్నామని, ఆర్డబ్ల్యూఎస్ ద్వారా భక్తులకు, పార్కింగ్ ఏరియాలలో మరియు సెక్టార్లలో మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్నామని, గ్రామపంచాయతీ ద్వారా శానిటేషన్ తో పాటు భద్రాచలంలోని 25 పాయింట్లు మంచినీటి సౌకర్యంతో పాటు, 15చోట్ల 162 టాయిలెట్లు, మూడు మొబైల్ టాయిలెట్లు ఏర్పాట్లు చేశామని, 560 మంది సిబ్బంది అందుబాటులో ఉంచుకున్నామని అన్నారు. భక్తులు గోదావరి లోకి వెళ్లకుండా భారీ కేడింగ్ ఏర్పాటు చేశామని, లైఫ్ జాకెట్లు, లైఫ్ బాల్స్, 20 మంది గజ ఈతగాళ్లను, రిస్క్ బోట్స్ 15, గోదావరిలో ప్రమాద సూచికలను ఏర్పాట్లు చేసి ప్రజలు ఎవ్వరు గోదావరి లోపల వెళ్లకుండా ప్రత్యేక నిగా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. అగ్నిమాపక శాఖ ద్వారా భద్రాచలం పట్టణంలోని ముఖ్యమైన కూడళ్లలో కళ్యాణం జరుగు ప్రదేశాలలో ఆరు ఫైరింజన్లు ఏర్పాట్లు చేస్తున్నామని, వైద్య ఆరోగ్య శాఖ ద్వారా భద్రాచలం, పర్ణశాల, హెలిపాడ్, వాహనాల పార్కింగ్ స్థలాలలో కలుపుకొని 13 మెడికల్ క్యాంపులు,05 అంబులెన్సులు, 30 మంది ఫీల్డ్ స్టాప్, ఏరియా ఆసుపత్రిలో ప్రత్యేక వార్డు ఐసీయూ 24 గంటలు పని చేసే అంబులెన్స్ తో పాటు ఓఆర్ఎస్ పాకెట్లు అన్ని జబ్బులకు మందులు అందుబాటులో ఉంచుతున్నామని, ఎక్సైజ్ శాఖ ద్వారా 6, 7 తేదీలలో బార్ షాపులు మరియు బెల్టు షాపులు అన్నింటిని క్లోజ్ చేస్తామని, నాలుగు చోట్ల మొబైల్ చెక్పోస్టులు ఏర్పాటు చేసి గట్టిగా పెడుతున్నామని అన్నారు. అధికారులు భక్తులు మాత్రమే స్వామి వారి కళ్యాణం వీక్షించే విధంగా చూడాలని, కుటుంబ సభ్యులకు గానీ, బంధువులకు గాని ప్రాధాన్యత ఇవ్వకూడదని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జేసి వేణుగోపాల్, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్, ఏ ఎస్ పి విక్రాంత్ కుమార్ సింగ్, ఆర్డీవో దామోదర్ రావు, దేవస్థానం ఈవో రమాదేవి మరియు వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు ఘన నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్








**ఖమ్మం, నవభూమి బ్యూరో, ఏప్రిల్ 02:** శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఘన నివాళులు అర్పించారు. బుధవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించిన శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాల్గొని, అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి వారి ఆశయ సాధనకు పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, జిల్లా బీసి అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి, గౌడ సంఘం నాయకులు మిత్రు గౌడ్, అంజయ్య, ప్రతినిధులు, ఇతర ప్రజా ప్రతినిధులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఎన్. అరుణ, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్‌కు నివాళి

**ఖమ్మం క్రైం, నవభూమి, ఏప్రిల్ 2-** నేలకొండపల్లి పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తు మృతి చెందిన కానిస్టేబుల్ బండి క్రిష్ణాకు ఎస్సై సంతోష్, తోటి పోలీసు సిబ్బంది, పోలీస్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వేంకటేశ్వర్లు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మృతిని స్వగ్రామైన వైరా మండలం రెబ్బవరంలో అంత్యక్రియలు నిర్వహించారు.



# సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం

**పాల్వంచ ఏప్రిల్ 2 నవభూమి ప్రతినిధి:** పాల్వంచ సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను బుధవారం దగ్ధం చేశారు. హైదరాబాదులో సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన 400 ఎకరాల భూమిని ప్రభుత్వం వేలం వేయడాన్ని నిరసిస్తూ, యూనివర్సిటీ విద్యార్థులు సిపిఎం పార్టీ నాయకులు ఆందోళనకు దిగితే వారిని అరెస్టు చేసి, అక్రమ కేసులు పెట్టడాన్ని నిరసిస్తూ అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పాల్వంచ పట్టణం అంబేద్కర్ సెంటర్లో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మని దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి పొదిల తులసీరామ్, కార్యవర్గ సభ్యులు కే సత్య, ఎస్ కే నిరంజన్, సీనియర్ నాయకులు ఎస్కే రహీం భాష, నారాయణ, సోమలింగం, గుర్రం రాములు,



యాకూబ్, కళ్యాణ్, గట్టయ్య తదితరులు పాల్గొన్నారు

# ఖమ్మంలో నాలుగున్నర దశాబ్దాల జర్నలిజం

రాజకీయ చైతన్యం గల ఖమ్మం జిల్లా కేంద్రంలో పాత్రికేయ రంగానికి ఎంతో ఘనమైన చరిత్ర వుంది. ఇక్కడ పాత్రికేయ రంగం నాలుగున్నర దశాబ్దాలుగా విలసిల్లుతోంది. పాత్రికేయ రంగంలో 40 సంవత్సరాల చరిత్ర స్పష్టంగా కనిపిస్తుంది. గతంలో ఇక్కడ వివిధ దినపత్రికలకు ఎంతో మంది జర్నలిస్టులుగా పనిచేసారని తెలుస్తోంది.

1984, 1985 సంవత్సరాలలో ఖమ్మం జిల్లా కేంద్రంలో ఈనాడుకు నాగేశ్వరరావు, ఇండియన్ ఎక్స్ప్రెస్, ఆంధ్రప్రభ దినపత్రికలను యస్.వి. సూర్యనారాయణ, ఆంధ్రజ్యోతికి కౌముది, ఆంధ్రప్రతికకు ఆర్.భవానీ సింగ్, ఆంధ్రభూమి, డెక్కన్ క్రానికల్‌కు జె.సూర్యనారాయణ, ఉదయంకు వక్కలంక వెంకటేశ్వర్లు, విశాలాంధ్రకు రాఘవయ్య, ప్రజాశక్తికి యాదా జానయ్య, సియాసత్ (ఉర్దూ పత్రిక)కు మొహ్మద్ ఇస్మాయిల్ పత్రికా ప్రతినిధులు (కరస్పాండెంట్స్)గా పనిచేసారు. ఉదయం దినపత్రికకు గంటి అన్నాజీరావు రోవింగ్ కరస్పాండెంట్‌గా పనిచేసారు. అంతకు పూర్వం ఇక్కడ ఇండియన్ ఎక్స్ ప్రెస్, ఆంధ్రప్రభ దినపత్రికలకు గంటి అన్నాజీరావు కరస్పాండెంట్ గా పనిచేసారు.

అప్పట్లో జిల్లా కేంద్రంలో కేవలం పది మంది జర్నలిస్టులు మాత్రమే వుండేవారు. ఆ రోజులలో ఖమ్మం పట్టణానికి ఎనిమిది తెలుగు దినపత్రికలు, మూడు ఆంగ్ల దినపత్రికలు, ఒక ఉర్దూ పత్రిక వచ్చేవి. జిల్లా కేంద్రంలో వివిధ ఏరియాలకు, వివిధ విభాగాలకు రిపోర్టర్లు వుండేవారు కాదు. ఒకే పత్రికా సంస్థకు చెందిన రెండు దిన పత్రికలను కూడా ఒక్కరే కరస్పాండెంట్ గా వుండేవారు. తర్వాత కాలంలో ఇక్కడకు ఖమ్మం టుడే (వీక్లీ), జనత, గమనం, పోతుగడ్డ పత్రికలొచ్చాయి. అప్పటి పాత్రికేయ రంగానికి సంబంధించిన అనేక విషయాలు ఖమ్మం జిల్లా కేంద్రంలో అప్పుడు ఇండియన్ ఎక్స్ ప్రెస్, ఆంధ్రప్రభ' దినపత్రికలకు కరస్పాండెంట్ పనిచేసిన యస్.వి. సూర్యనారాయణ నవభూమి దినపత్రిక ప్రతినిధికి తెలియజేసారు.

జిల్లా కేంద్రమైనప్పటికీ ఆనాడు ఖమ్మంలో జర్నలిస్టులకు ప్రెస్ క్లబ్ లేదు. కంప్యూటర్స్ లేవు. ఇళ్ళ స్థలాలు లేవు. బస్ పాస్లు లేవు. జిల్లా కేంద్రంలో వార్తల సేకరణకు ఎక్కడికి వెళ్లాలన్నా జర్నలిస్టులు నడిచే వెళ్ళేవారు. సామన్య మానవుని వాహనమైన సైకిల్ కొంత మంది జర్నలిస్టులకు ప్రధాన వాహనంగా వుండేది. అప్పట్లో ఆటోలు లేవు. బస్టాండ్, రైల్వే స్టేషన్ల వద్ద రిక్షాలుండేవి. తప్పనిసరి పరిస్థితులలో జర్నలిస్టులు రిక్షాలో వెళ్ళేవారు. మయూరి సెంటర్‌కు ఎంతో ప్రాధాన్యత వుండేది. మయూరి సెంటర్ నుంచి కలెక్టరేట్ కు వెళ్ళటానికి రిక్షా ఛార్జి రెండు రూపాయలు వుండేది.

ఆనాడు ఇక్కడ ఈనాడు, ఉదయం దినపత్రికలకు మాత్రమే పత్రికా కార్యాలయాలు ఉండేవి. ఈ రెండు దినపత్రికల ప్రతినిధులు తమ వార్తలను విజయవాడలోని తమ ప్రచురణ కేంద్రాలకు టెలిప్రింటర్స్ ద్వారా పంపించేవారు. మిగిలిన దినపత్రికల ప్రతినిధులు విపులంగా వుండే వ్యాసాలను, కథనాలను బస్సు డ్రైవర్ ల ద్వారా పంపించేవారు. ప్రతిరోజు వార్తలను పంపించటానికి వార్తా పత్రికల సంస్థలు రిపోర్టర్లకు ప్రెస్ బేరింగ్ అథారిటీ కార్డులను ఇచ్చేవారు. ఇండియన్ పోస్టల్ అండ్ టెలిగ్రాఫ్ డిపార్ట్మెంట్ (భారత తంతి తపాల శాఖ) ద్వారా జారీ చేయబడిన ఇన్ ల్యాండ్ ప్రెస్ టెలిగ్రామ్స్ క్రెడిట్ కార్డ్ ద్వారా పత్రికా కార్యాలయలకు ప్రెస్ టెలిగ్రామ్స్ పంపించే వారు ప్రెస్ టెలిగ్రామ్స్ ను డిపార్టమెంటల్ టెలిగ్రాఫ్ ఆఫీసులో ఇవ్వగానే వెంటనే ఆపరేటర్లు టెలి ప్రింటర్స్ ద్వారా విజయవాడకు పంపించేవారు. జర్నలిస్టులకు టెలిగ్రాఫ్ శాఖ సహకారం మరువలేనిది.

పత్రికా రంగంలో ప్రింటింగ్ టెక్నాలజీలో సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందని ఆ రోజుల్లో కంప్యూటర్లు, స్కానర్లు లేవు. ఖమ్మం నుంచి విజయవాడకు ఫొటోలు పంపాలంటే చాలా కష్టంగా వుండేది. జిల్లా కేంద్రాలలో జరిగిన ర్యాలీలు, సమావేశాలకు సంబంధించిన ఫొటోలను అదే రోజు విజయవాడలోని పత్రికా కార్యాలయాలకు అందించటానికి జర్నలిస్టులు రైల్వే స్టేషన్ కు వెళ్ళి కోణార్క్ ఎక్స్ ప్రెస్‌లో డ్రైవర్‌కు ఇచ్చి పంపించేవారు. విజయవాడలో రైల్వే స్టేషన్‌కు వచ్చి వివిధ పత్రికల సిబ్బంది వాటిని సేకరించుకునేవారు. అనాడు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్న ప్రింట్ మీడియా ప్రజలలో విశేష ఆదరణను పొందింది.

ఖమ్మం జిల్లా కేంద్రంలో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లకు ప్రధాన కేంద్రంగా ఉండేది. కేంద్ర, రాష్ట్ర మంత్రుల, వివిధ రాజకీయ పార్టీల అగ్రనాయకుల ప్రెస్ మీట్స్ అక్కడే జరుగుతుండేవి. వివిధ రాజకీయ పార్టీల జిల్లా నాయకులు తమ ప్రెస్ మీట్ లను తమ పార్టీ కార్యాలయాలలో నిర్వహించేవారు. ప్రభుత్వేతర, స్వచ్ఛంద సేవా సంస్థల సమావేశాలు, ప్రెస్ మీట్ లను కిన్నెర, మానస హెూటల్స్‌లోని కాన్ఫరెన్స్ హాల్స్ జరిగేవి. రాజకీయ పార్టీల జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొనే భారీ బహిరంగ సభలు పెవిలియన్ గ్రౌండ్లో నిర్వహించేవారు. ఖమ్మం కళాపరిషత్, రాగసుధ అను సాంస్కృతిక సంస్థలు తమ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేవి. ప్రభుత్వం అమలు పరిచే సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు జిల్లా పౌరసంబంధాల శాఖాధికారులు తమ సిబ్బంది ద్వారా పత్రికా ప్రతినిధులకు అందజేసేవారు. ప్రభుత్వేతర సంస్థలకు చెందిన కార్యక్రమాలకు జర్నలిస్టులు స్వయంగా హాజరై వాటికి సంబంధించిన విషయాలను సేకరించేవారు. అప్పట్లో ఖమ్మం జిల్లా కలెక్టర్‌గా పి.కె. రస్తోగి వున్నారు. పి.కె. రస్తోగి తర్వాత రాజన్ హబీబ్ ఖ్వాజా జిల్లా కలెక్టర్ గా వున్నారు. జిల్లా పౌర సంబంధాల శాఖాధికారి (డి.పి.ఆర్.ఓ) గా యన్. నరసింహారావు పనిచేసారు.

అప్పట్లో జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న ప్రతికా ప్రతినిధులకు ఇంటర్ డిస్ట్రిక్ట్ ప్రెస్టూర్స్ నిర్వహించేవారు. ఒక జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న పత్రికా ప్రతినిధులు మరొక జిల్లాకు వెళ్ళి అక్కడ ప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను స్వయంగా చూసి వాటికి సంబంధించిన సమాచారాన్ని సేకరించి ప్రత్యేక వ్యాసాలను వ్రాసేవారు. ఒక జిల్లాకు చెందిన పత్రికా ప్రతినిధులను మరొక జిల్లాకు తీసుకెళ్ళడం వల్ల ఆ జిల్లాలో నిర్వహిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల అవగాహన కల్పించేవారు. 1985లో జిల్లా పౌర సంబంధాల శాఖకు చెందిన అధికారుల నేతృత్వంలో ఖమ్మం జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న జర్నలిస్టులు కరీంనగర్‌ను సందర్శించారు. ఆ



జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అధికారులు పాత్రికేయులకు వివరించారు. అప్పటి కరీంనగర్ జిల్లాలోని వేములవాడ సిరిసిల్ల, జగిత్యాల, కొండగట్టును పాత్రికేయులు సందర్శించారు. ఆ రోజుల్లో జిల్లా కేంద్రంలో పనిచేస్తున్నా జర్నలిస్టులు అక్రిడిటేషన్ కార్డు పొందడం మాములు విషయం కాదు. అక్రిడిటేషన్ కార్డు పొందడం చాలా కష్టంగా వుండేది. జర్నలిస్టుల నియామకపు పత్రములో (అపాయింట్మెంట్ లెటర్)లో కరస్పాండెంట్ అను పదం ఉంటేనే అక్రిడిటేషన్ కార్డు ఇచ్చేవారు. పత్రికా సంస్థలు నియామకపు పత్రములో కరస్పాండెంట్‌కు బదులుగా ఏ పదం వాడినా అక్రిడిటేషన్ కార్డు ఇచ్చేవారు కాదు. అందువలన జిల్లా కేంద్రంలో కూడా అక్రిడిటేషన్ కార్డు గల జర్నలిస్టులు చాలా తక్కువగా వుండేవారు. కరస్పాండెంట్ అనే పదం ఉంటేనే అక్రిడిటేషన్ కార్డు ఇవ్వాలనే నిబంధన ఉందని, అందువలన నియామకపు పత్రములో ఆ పదం లేకపోతే అక్రిడిటేషన్ కార్డు ఇవ్వడం సాధ్యపడదని జిల్లా పౌర సంబంధాల శాఖాధికారులు చెప్పేవారు. పాఠకుల ఆదరణ, ప్రజల గుర్తింపునే నిజమైన గుర్తింపుగా భావించి పత్రికా ప్రతినిధులు ఎంతో ఉత్సాహంగా పనిచేసేవారు. ఎంతో రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకున్న ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నేతలకు పుట్టినిల్లుగాను, కమ్యూనిస్టులకు కంచుకోటగాను పేరు పొందింది. ఖమ్మంను పోరాటాల గుమ్మంగా వర్ణించవచ్చు. ఇక్కడ జర్నలిస్టులు ఐకమత్యంగా వుంటూ ఎంతో కష్టపడి పనిచేసారు. జర్నలిస్టులను ప్రజలు, ప్రభుత్వ అధికారులు ఎంతో గౌరవించేవారు. జర్నలిస్టులకు సమాజంలో ప్రత్యేక గుర్తింపు వుండేది. వార్తా పత్రికలను విశేషంగా ఆదరించే పాఠకులు, ప్రజల సమస్యలను సహృదయతతో అర్థం చేసుకొని వాటిని వార్తల రూపంలో ప్రచురించి ప్రభుత్వానికి తెలియజేసే జర్నలిస్టులతో పత్రికా రంగం ప్రకాశించింది. పత్రికా రంగంలో పోటీలేని అనాడు ప్రజలు దినపత్రికలన్నింటినీ సమానంగా చూసేవారు. జర్నలిస్టులందరినీ సమానంగా గౌరవించేవారు. ఖమ్మం జిల్లా పత్రికా రంగం చరిత్రలో 1985వ సంవత్సరం ఒక సువర్ణాధ్యాయంగా నిలిచిపోతుంది.

పాత్రికేయ రంగంలో ఖమ్మం జిల్లాకు ఒక విశిష్ట స్థానం వుంది. జిల్లా కేంద్రంలో తర్వాత కాలంలో పత్రికా రంగం ఎంతో అభివృద్ధిని సాధించింది. స్టేట్ ఆఫ్ ఆర్ట్ టెక్నాలజీ అమలులోకి వచ్చిన తర్వాత కంప్యూటర్లు, స్కానర్లు



రావడంతో జర్నలిస్టులకు ఎంతో మేలు జరిగింది. ఎటువంటి వ్యయప్రయాసాలు లేకుండా ఖమ్మం నుండి పత్రికా కార్యాలయాలకు వార్తలను ఫొటోలను పంపడానికి అవకాశం ఏర్పడింది. ఖమ్మం జిల్లా కేంద్రంలో జర్నలిస్టుగా పని చేయడం అదృష్టంగా, ఒక గొప్ప అరుదైన అవకాశంగా అప్పట్లో జర్నలిస్టులు భావించేవారు. ఇక్కడ వివిధ పత్రికలలో పని చేసిన పత్రికా ప్రతినిధులు సామాజిక, రాజకీయ పరిస్థితులపై ఎంతో అవగాహనతో, చక్కటి భాషా పరిజ్ఞానంతో ఎన్నో ఆసక్తికరమైన కథనాలను, వార్తలను రాసి పాఠకుల ఆదరణను పొందారు. వృత్తిలో ఉన్నత ప్రమాణాలు పాటిస్తూ ఎంతో మంది విద్యావేత్తలు, ప్రతిభావంతులు, మేధా సంపన్నులైన జర్నలిస్టులు ఎంతో కష్టపడి పనిచేసి, అంకిత భావంతోను, నిజాయితోను నిష్పక్షపాతంగా విధులను నిర్వర్తించారు. ఆదర్శవంతమైన ఆశయాలతో తమ విశేష ప్రతిభాపాటవాలతో ఖమ్మం జిల్లాలో పాత్రికేయ రంగానికి బంగారు బాటలు వేసిన జర్నలిస్టులను తలచుకుంటే ఎంతో ధైర్యం, స్ఫూర్తి కలుగుతుంది. జిల్లాలో పాత్రికేయ రంగం విశేషంగా అభివృద్ధిని సాధించాలనే ఆశయంతో పని చేసిన జర్నలిస్టులు తమ లక్ష్య సాధనలో సఫలీకృతులయ్యారు. అప్పటి పరిస్థితులను తెలుసుకుంటే నేటి జర్నలిస్టులకు ఎంతో ఆశ్చర్యం కలుగుతుంది. ఎంతో అభివృద్ధిచెందిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రకాశిస్తున్న నేటి పత్రికా రంగాన్ని చూస్తే అప్పటి జర్నలిస్టులకు ఎంతో సంతోషం కలుగుతుంది.గత నాలుగున్నర దశాబ్దాలుగా జిల్లా కేంద్రంలో పాత్రికేయ రంగం విశేష అభివృద్ధిని సాధించింది. కాలానుగుణంగా ఇక్కడ దినపత్రికలు పెరగడంతో పాటు జర్నలిస్టుల సంఖ్య, పాఠకుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్ మీడియాకు చెందిన ఎంతో మంది రిపోర్టర్లు అభివృద్ధి చెందిన సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఖమ్మం జిల్లా కేంద్రంలో జర్నలిస్టుగా పనిచేయడం ఒక కీర్తి కిరీటంగా భావించవచ్చు. ప్రజాస్వామ్యంలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్న మీడియా రంగం రానున్న కాలంలో ఉజ్వలమైన భవిష్యత్తును కలిగి ఉంటుందని, జర్నలిస్టులకు ఎంతో మేలు జరుగుతుందని అశిద్దాం.

సర్వా వెంకట సూర్యనారాయణ
సీనియర్ జర్నలిస్ట్, ఇల్లెందు
సెల్: 9848758175

# సెంట్రల్ యూనివర్సిటీ భూములను అమ్మితే పోరాటాలు తప్పవు

**టేకులపల్లి ఏప్రిల్ 2 నవభూమి ప్రతినిధి:** హైదరాబాదులోని విద్యార్థులకు ప్రయోగశాలైన సెంట్రల్ యూనివర్సిటీ భూములను అమ్మకానికి పెట్టిన రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విద్యార్థుల పోరాటం తప్పదని ప్రగతిశీల యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల భానుచందర్ అన్నారు. హైదరాబాదు నడిబోడ్డులో ఉన్న సెంట్రల్ యూనివర్సిటీలో 5000 మంది విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారు. విద్యాలయానికి ఆనాడు 2500 ఎకరాలు కేటాయిస్తే, ఒక్కొక్క ప్రభుత్వం కొంత అమ్ముకుంటూ వస్తూ చివరికి 1800 ఎకరాలు మిగిలింది. ఈ 1800 ఎకరాలు కూడా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో కేసు గెలిచామని గొప్పలు చెప్పుకుంటూ ఇది విద్యార్థుల విజయం అంటూ విర్రవీగిన రేవంత్ రెడ్డి తెల్లారే భూములను కార్పోరేట్ శక్తులకు అమ్మకానికి పెట్టడం సిగ్గుచేటని వారు అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో చెట్లను నరికితే కేసులు పెడుతున్న ప్రభుత్వాలు, పదివేలకు పైగా చెట్లు నరుకుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఎందుకు కేసు నమోదు చేయదో కోర్టులు చెప్పాలని ప్రశ్నించారు. యూనివర్సిటి భూముల అమ్మకాలను వ్యతిరేకిస్తూ పోరాటాలు చేస్తున్న విద్యార్థులపై అక్రమ కేసులు పెట్టి, విద్యార్థినిలను జైల్లో పెట్టడం, లాఠీచార్జి చేయడం దుర్మార్గమని అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుతామని ప్రమాణాలు చేసిన పాలక ప్రభుత్వాలు, న్యాయమూర్తులు, విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే విద్యాలయాల భూములను అమ్ముతుంటే ఎందుకు నోరు మెదపడం లేదని అన్నారు. తక్షణమే సెంట్రల్ యూనివర్సిటీ భూముల అమ్మకాని నిలిపివేయాలని, లేకపోతే ఉద్యమాలు ఆగవని ఆయన అన్నారు. అక్రమంగా విద్యార్థులపై నమోదు చేసిన కేసుల్ని వెనక్కి తీసుకోవాలని, తిరిగి భూమిని విద్యాలయాలకు అప్పచెప్పాలని, విద్యాలయాల పేరుమీద రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు. నేడు జరిగే సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమంను విజయవంతం చేయాలని కోరారు.



# మండలంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం, ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**ములకలపల్లి ఏప్రిల్ 2 నవభూమి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలనలో భాగంగా ఎంతో ప్రతిష్టాత్మంగా ప్రవేశపెట్టిన సన్నబియ్యం కార్యక్రమం మండలం లోని జగన్నాధపురం లో స్ధానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సూచన మేరకు ములకలపల్లి మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్ రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మాజీ జెడ్పిటిసి బత్తుల అంజి ఆధ్వర్యంలో ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు పామర్తి కృష్ణ,కవులూరి ప్రసాద్, కొప్పుల రాంబాబు, సెనగపాటి రవి, గాదె తిరుపతిరెడ్డి, సురభి రాజేష్, షేక్ జానీ, మడకం చిరుమప్ప, కుంజా వినోద్, మరీదు నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీ నాయకులు సేల్స్ మెన్ గ్రామ ప్రజలు మహిళలు తదితరులు పాల్గొన్నారు

# బొమ్మనపల్లిలో పాపన్న గౌడ్ వర్ధంతి



**టేకులపల్లి ఏప్రిల్ 2 నవభూమి ప్రతినిధి:** సర్దార్ పాపన్న గౌడ్ వర్ధంతిని మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని శ్రీ కంఠ మహేశ్వర స్వామి దేవాలయం వద్దగల పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు బుర్ర ధర్మయ్య గౌడ్ కుల సంఘం పెద్దలు పాల్గొన్నారు.

# చిరు దొంగతనాలకు పాల్పడుతున్న విద్యార్థులు





**పాల్వంచ ఏప్రిల్ 2 నవభూమి ప్రతినిధి:** స్థానిక ఆశ్రమ గిరిజన బాలుర హాస్టల్లో ఉంటూ, చదువుకుంటున్న విద్యార్థులు చిరు దొంగతనాలకు పాల్పడుతున్న సంఘటన ఒకటి మంగళవారం వెలుగు చూసింది. ఇందుకు సంబందించిన వివరాలు ఈ విదంగా ఉన్నాయి. భద్రాచలం ప్రధాన రహదారి కి అనుకోని ఉన్న బాలుర హాస్టల్లో ఉంటూ, పదవ తరగతి చదువుతున్న విద్యార్థులలో నలుగురు విద్యార్థులు చిరు తిండ్లకు అలవాటు పడి, వాటిని కోనేందుకు డబ్బులు లేక పోవటం తో వాళ్ళు ఉంటున్న హాస్టల్ కు ఆనుకొని ఉన్న బడ్డీ కొట్లో దొంగతనానికి పాల్పడ్డారు. సుమారు 5 వేల విలువ గల చిరుతిండ్లు, ఇతర వస్తువులు అపహరణ దొంగ తనం చేశారు. అనుమానం వచ్చిన ఆ షాప్ యజమాని, పోలీసుల సహకారం తో ఆ నలుగురు విద్యార్థుల వద్ద సోదా చేయగా, వారి వద్ద దొంగలించిన సొత్తు లభించింది. హాస్టల్ వార్డెన్ అలసత్వం, హెచ్ ఎం పర్యవేక్షణ లోపంతో రోజు రాత్రి వేళలో నిత్య కృతంగా కొనసాగుతున్న విద్యార్థుల చిరు దొంగతనాలు అని పలువురు అనుకుంటున్నారు

# వైరాలో ఏప్రిల్ 13న టియుసిఐ జిల్లా మహాసభలు

## ■ జయప్రదం చేయాలని పోస్ట్ ఆవిష్కరణ

**సత్తుపల్లి, నవభూమి, ఏప్రిల్ 2 :** టి యు సి ఐ ఈ నెల 13న వైరా పట్టణంలోని కామిశెట్టి కల్యాణ మండపం లో కామ్రేడ్ ఆడెపు రామారావు నగర్ లో జరిగే ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీ యు సి ఐ) ఖమ్మం జిల్లా ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని బుధవారం సత్తుపల్లిలో జేవియర్ ఓసీ, సమంత క్యాంపు లో, మున్సిపల్ వర్కర్స్ తో గ్రూప్ మీటింగ్ నిర్వహించి మహాసభ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి టియుసిఐ సత్తుపల్లి ఏరియా కమిటీ కార్యదర్శి అమర్లపూడి శరత్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఎంపికైన 400 మంది కార్మిక ప్రతినిధులు, జిల్లాలో 7 ఏరియా కమిటీలు, 1సింగరేణి బొగ్గుబావి బ్రాంచి కమిటీ నుండి మహాసభలకు హాజరవుతున్నారన్నారు. ఉదయం 10 గంటలకు కార్మిక మహా ప్రదర్శన పట్టణంలో నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం మహాసభ ప్రారంభించడం జరుగుతుందని ఆయన తెలిపారు. గత మహాసభలో కార్మికుల సమస్యలపై చర్చించి మహాసభలలో భవిష్యత్ కార్యాచరణ నిర్ణయించడం జరుగుతుందన్నారు. దేశంలో రాష్ట్రంలో సంఘటిత, సంఘటనంగా కార్మికులు ఎదుర్కొన్న సమస్యలను సవాళ్లను టియుసిఐ ఎప్పటికి అధ్యయనం చేస్తూ పోరాడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు కార్మిక చట్టాల సవరణ, ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడే క్రమంలో కార్మికుల పక్షపాతిగా నిరంతరం




పనిచేస్తుందన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం విద్యుత్, అంగన్వాడీ, హమాలి, మున్సిపల్, మధ్యాహ్న భోజనం, ఆశ వర్కర్లు, కేజీబీవీ భవన నిర్మాణ కార్మికులు, మిషన్ భగీరథ, మోటర్, సింగరేణి, గ్రామపంచాయతీ తదితర రంగాల కార్మికుల సమస్యల పరిష్కారం కోసం బాధ్యతగా పనిచేస్తూ వారి హక్కుల కోసం పోరాడుతుందన్నారు. ఈ క్రమంలోనే భవిష్యత్ కార్యాచరణ చర్చించడం కొరకు ఈనెల 13వ తేదీన వైరా లో జిల్లా ప్రథమ మహాసభ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి కార్మికుల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. . ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వర్కర్స్ పూచ్చి రవి పుల్లారావు ,ప్రతాప్ ,పోతురాజు, సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ కట్ల ప్రసాదు ,గేగా సురేష్, కనకయ్య, మల్లికార్జున రావు,తదితరులు పాల్గొన్నారు

# నేడు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చలో సెక్రటేరియట్

## ■ ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వరక అజిత్

**పాల్వంచ ఏప్రిల్ 2 నవభూమి ప్రతినిధి:** పట్టణ పరిధి లోని చంద్రరాజేశ్వరరావు భవన్ లో బుధవారం ఏఐ ఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్త సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి అజిత్ పాల్గొని మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సంబంధించిన 400 ఎకరాల భూమి వేలాన్ని నిలిపి వేయాలన్నారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రేపు జరిగే చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చా రు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలాన్ని నిలిపివేయాలని, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన 400 ఎకరాల భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం ఆక్రమించుకొని, వేలం వేసేందుకు సిద్ధమైందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడిదారుల దాహం తీర్చేందుకే భూముల అమ్మకానికి కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు అడుగులు వేస్తుందన్నారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం భూమిని ఎరగా చూపి ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు తాకట్టుపెట్టే హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని అయన అన్నారు.

యూనివర్సిటీల అభివృద్ధికి కృషి చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా భూములనే కొల్లగొట్టేందుకు సిద్ధమైతే భవిష్యత్తులో యూనివర్సిటీలో ఉనికి ప్రమాదకరం గా మారుతుందని అన్నారు. ప్రభుత్వాల నుండి ఎదురయ్యే ప్రమాదకర పరిస్థితిలను గమనించిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు భవిష్యత్తులో ప్రయోగ శాలలకు, అవసరమైన భూములు చేజారిపోతే భవిష్యత్ తరాల విద్యార్థులకు యూనివర్సిటీ ఉనికికి ప్రమాదమని న్యాయబద్ధంగా భూముల రక్షణ కోసం పోరాటాన్ని కొనసాగిస్తుంటే కాంగ్రెస్



ప్రభుత్వం విద్యార్థుల గొంతు నొక్కి అక్రమ అరెస్టులకు పాల్పడుతుందన్నారు. కెసిఆర్ ను తల పించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందని, ఇలాంటి నియంతృత్వ విధానాలను కొనసాగించి విద్యార్థులని అని కూడా చూడకుండా పోలీసులతో దుశ్చర్యాలను కొనసాగిస్తుందన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల అక్రమ అరెస్టును అఖిల భారత విద్యార్థి సమైక్య భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి తీవ్రంగా ఖండిస్తుందన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నుండి పోలీసులు వెనకకు వచ్చే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, భూముల అమ్మకాన్ని విరమించుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గుండాల సుజన్, నాయకులు నితిన్ రెడ్డి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# చలో జోడెన్ ఘాట్‌ను విజయవంతం చేయాలి

## ■ తుడుందెబ్బ ఆగబోయిన రవి పిలుపు

**గుండాల ఏప్రిల్ 2 నవభూమి:** తెలంగాణ రాష్ట్రములోని ఆదివాసీలు తమ అస్తిత్వం ను,కోల్పోయి బ్రతుకు జీవుడా అంటూ అభివృద్ధి కి దూరంగా, ప్రభుత్వ, సంక్షేమ పథకాలకు నోచుకోకుండా, ఆదివాసీ నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పన, ఉపాధి, లేక పోవడంతో, తీవ్ర మనో వేదనకు గురౌతున్నారని, రాష్ట్రములోని ఆదివాసీల భూములు వలస వాదుల, అదీనం అక్రమంగా దోపిడీకి గురైన విధానమును గిరి గ్లాని కమీషన్ రిపోర్ట్ తేట తెల్లం చేసిన విషయం, ప్రభుత్వాలకు తెలిసినా ఆదివాసీల దోపిడీ చేసిన వర్గాలకే ప్రభుత్వాలు రాజకీయ పార్టీలు, వంతపాడుతున్నాయని, ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో ప్రత్యేకంగా స్వయం పాలన అధికారం అమలులో ఉందనే నిజం తెలిసినా పాలకులు తమ రాజకీయ అధికారం కోసం ఆదివాసీలను అణిచి వేసే ధోరణితో ఆదివాసీలపై, కుట్ర పూరిత విధానాలు అనుసరించి చొర బాటుదారులతో ఆదివాసీ ప్రాంతంను చిన్నా భిన్నం చేస్తూ ఆదివాసీల మనుగడకు తీవ్ర ఆటంకం కల్గిస్తున్న భూర్జువ రాజకీయ పార్టీలు, వలసవాద గిర్జనేతరుల భారీ నుండి ఆదివాసీలను కాపాడుకునేందుకు, ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర మహాసభలను కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కెరమేరి మండలం కొమురం భీమ్ యుద్ధ భూమి అయిన జోడెన్ ఘాట్ లో భారీ ఎత్తున నిర్వహించడం జరుగుతుంది. ఈ రాష్ట్ర మహాసభలకు



వక్తలుగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమ నేత, ఎమ్మెల్సీ ప్రొపెసర్ ఆచార్య కోదండరాం, ఓయూ ప్రిన్సిపాల్ ప్రొపెసర్ కాశీం, విశ్రాంత ప్రొపెసర్ హరగోపాల్ లు హాజరై ప్రసంగిస్తారాని, ఈ మహాసభల విజవంతం కోసం తుడుందెబ్బ రాష్ట్ర, జిల్లా మండల ముఖ్య నాయకత్వం హాజరై విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ ఆగబోయిన రవి బుధవారం కొత్తగూడ గ్రామ పంచాయితీ అవరణంలో జిల్లా అధ్యక్షులు కుంజ నర్సింగరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పిలుపునిచ్చారు. సమావేశంలో అల్లెం జంపయ్య, సిడం రమేష్, సిద్దబోయిన లక్ష్మీ నారాయణ, సతీష్ లుపాల్గొన్నారు.

# మీనవోలు పాఠశాలలో సరస్వతి దేవి విగ్రహ ఆవిష్కరణ



**ఎర్రుపాలెం, నవభూమి, ఏప్రిల్ 2 :** మండల పరిధిలోని మీనవోలు ఉన్నత పాఠశాలలో బుధవారం మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు, ఎంఈఓ బి మురళీమోహన్రావు లు పూర్వ విద్యార్థులు ఏర్పాటుచేసిన సరస్వతి దేవి విగ్రహావిష్కరణ ఘనంగాచేశారు. పాఠశాలపూర్వ విద్యార్థి కీర్తిశేషులు అమరా జనార్దన్ రావు జ్ఞాపకార్థం వారి కుమారుడు అమరా శ్యామ్ ఆర్థిక సహాయంతో సరస్వతి దేవి విగ్రహం స్కూల్ ఆవరణ నందు ఏర్పాటు చేయడం జరిగింది.బండారు నరసింహా రావు,మీనవోలు పాఠశాల ప్రధానోపాధ్యా యులైన బి మురళీమోహన్రావు సరస్వతి దేవి విగ్రహానికి పూలమాలలు వేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వేమిరెడ్డి అనురాధ,అమరా జగన్మోహన్రావు,జానీ భాష,ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, గ్రామస్తులు,పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# లాఠీచార్జిని నిరసిస్తూ గార్లలో రాస్తారోకో



**గార్ల, నవభూమి, ఏప్రిల్ 2:** హైదరాబాద్ లోని సెంట్రల్ యూనివర్సిటీ భూములను రాష్ట్ర ప్రభుత్వం అమ్మకానికి చేస్తున్న ప్రయత్నాలపై ఆందోళన చేస్తున్న విద్యార్థుల పోలీసులు లాఠీ చార్జి చెయడాన్న నిరసిస్తూ బుధవారం సిపిఎం పార్టీ కార్యకర్తలు గార్ల లో రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ స్థానిక నెహ్రూ సెంటర్ లో బైఠాయించడంతో పలు వాహనాల రాకపోకలకు అర్థగంట సేపు అంతరాయం కలిగింది. రాస్తారోకో నుద్దేశించి సిపిఎం పార్టీ మండల కార్యదర్శి అలవాల సత్యవతి మాట్లాడుతూ యూనివర్సిటీ భూములను రక్షించాల్సిన ప్రభుత్వం అమ్మకానికి ప్రయత్నించడం సరైన విధానం కాదని, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, రమా, మౌనిక, లోకేశ్వరరావు, మౌలానా, రామకృష్ణ, అశోక్, మోహన్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమి కబ్జా, రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి కాపాడిన పీరంపల్లి గ్రామస్తులు

**వికారాబాద్ జిల్లా ఏప్రిల్ 02 ( నవభూమి) ప్రతినిధి-** వికారాబాద్ మండలంలోని పిరంపల్లి గ్రామం చివారులో స్మశాన వాటిక దగ్గర్లో ఉన్నటువంటి ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ భూమినికి చుట్టూ ఫ్రీ కాస్ట్ వేయడం జరిగింది , మండల్ రెవెన్యూ అధికారులు సర్వే చేసి ప్రభుత్వ భూమి చుట్టూ వేసిన ఫ్రీ కాస్ట్ తొలగించడం జరిగింది, గ్రామంలో ఉన్నటువంటి ప్రజలకు ప్రభుత్వ భూమి కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికి ఉండాలని ఆయన తెలియజేశారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల రెవెన్యూ అధికారులు , పిరంపల్లి



గ్రామస్తులు, చంద్రయ్య, శ్రీనివాసు, కొండాపూర్ రవి, యాదగిరి యాదవ్, నరసింహులు, మధుకర్ రెడ్డి, సురేష్, తదిరులు పాల్గొన్నారు

# టిఆర్వికెఎస్‌పై వస్తున్న అసత్య ప్రచారాలను ఖండించండి

■ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చారుగుండ్ల రమేష్




**పాల్వంచ ఏప్రిల్ 2 నవభూమి ప్రతినిధి:** టిఆర్వికెఎస్ కార్మిక సంఘం పై ఈ మధ్య కాలం లో వస్తున్న అసత్య ప్రచారాలను ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చారుగుండ్ల రమేష్ తీవ్రంగా ఖండించారు. బుధవారం స్థానిక కెటిపిఎస్ ఆవరణ లోని టిఆర్వికెఎస్ ప్రాంతీయ కార్యాలయం నిర్వహించిన అత్యవసర సమావేశం టిఆర్వికెఎస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చారుగుండ్ల రమేష్ అధ్యక్షతన కొనసాగింది. ఈ సందర్భంగ అయన మాట్లాడుతూ టిఆర్వికెఎస్ యూనియన్ ఎదుగుదలను, పటిష్టతను చూసి, ఓర్వలేక టీజీ జెన్కో లోని కొన్ని కార్మిక సంఘాలు, కొంతమంది వ్యక్తులు తమ యూనియన్ పై అసత్య ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. ముఖ్యముగా టిఆర్వికెఎస్ యూనియన్ వేరే సంఘంలో విలీనమైనదని, టిఆర్వికెఎస్ ఒక పార్టీకి అనుబంధంగా ఉన్నదని అర్థం, పర్థం లేని అసత్య ప్రచారాలను చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇట్టి ప్రచారాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తా ము స్వతంత్ర ప్రతిపత్తి గల కార్మిక సంఘంగా కొనసాగుతున్నామని ఏ పార్టీకి అనుబంధంగా కొనసాగమని, ఏ సంఘంలో కలిసిపోయే ప్రసక్తే లేదని, రమేష్ స్పష్టం చేశారు. కార్మిక సమస్యల పరిష్కారం కొరకు నిరంతరాయంగా పనిచేస్తామని తెలిపారు. ఇక నైనా తమ యూనియన్ పై తప్పుడు ప్రచారాలు చేయటం ఆపాలన్నారు. ఈ సమావేశంలో కేటీపీఎస్ కాంప్లెక్స్ లోని రాష్ట్ర నాయకులు ఆర్ శ్రీనివాస్, పాశం రవిబాబు, జెన్కో నాయకులు కాలె%ఎ%కాంతయ్య, ధర్మపురి నాగేశ్వరరావు, తుర్లకుంట సత్యం, ఎండీ అమీన్, కేటీపీఎస్ రెండు రీజియన్ ల నాయకులు దెంచనాల రాంబాబు, ముత్యాల రాంబాబు, కురుమెళ్ళ రవికుమార్, ఎండీ సుభాని, ధర్మరాజులు నాగేశ్వరరావు, పి విజయ్ శంకర్, వైటిపిఎస్ రీజయన్ నాయకులు మల్లెల వీరనారాయణ, నాదెళ్ల రవికుమార్, రీజనల్ నాయకులు నారందాసు వెంకటేశ్వర్లు, బ్రాంచ్ నాయకులు ఖమ్మం శ్రీను తదితరులు పాల్గొన్నారు

# క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు

■ ముఖ్య అతిథులుగా పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు

■ ఫైనల్లో విజేత వెంకటాపురం టీం,

■ రన్నర్‌గా తుమ్మలచెరువు టీం



**అశ్వాపురం ఏప్రిల్ 2 నవభూమి:** అశ్వాపురం మండలం తుమ్మలచెరువు, వెంకటాపురం గ్రామ పంచాయతీ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు. ఫైనల్ మ్యాచ్లో మొదటగా బ్యాటింగ్ చేసిన తుమ్మలచెరువు టీ తొమ్మిది వికెట్ల నష్టానికి 12 ఓవర్లలో 60 పరుగులు చేయగా అనంతరం 60 పరుగుల లక్ష్యాన్ని బ్యాటింగ్ చేసిన వెంకటాపురం టీం 8 ఓవర్లు ముగియకుండానే లక్ష్యాన్ని చేదించి విజేతగా నిలిచారు. అనంతరం మండల అధ్యక్షులు ఓరుగంటి బిక్షమయ్య మాట్లాడుతూ తుమ్మలచెరువు, వెంకటాపురం కాంగ్రెస్ పార్టీ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించకపోవడం చాలా సంతోషంగా ఉందని, గత వారం పది రోజులుగా ఆహ్లాదకరమైన వాతావరణంలో ఎండల్ని సైతం లెక్క చేయకుండా 16 టీంలు టోర్నీలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని, గెలుపొందిన టీం కి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం గాదే కేశవరెడ్డి మాట్లాడుతూ టోర్నమెంట్లో గెలుపు ఓటమి సహజమని, ఈ యొక్క క్రీడా స్నేహాన్ని పెంపొందించడానికి దోహదపడతాయని, ఈ యొక్క ఫైనల్ లో గవర్నమెంట్ ని వీక్షించడం చాలా సంతోషంగా ఉందని తెలియజేశారు. నెల్లిపాక సొసైటీ చైర్మన్ తుక్కని మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఫైనల్ లో హొరాహొరీ జరిగిన మ్యాచ్ లో గెలుపొందిన టీమ్ లకు శుభాకాంక్షలు తెలియజేస్తూ టోర్నమెంట్ ఫైనల్ ఐపీఎల్ మ్యాచ్ ని తలపించేలా ఉన్నాయని, మంచి ప్రదర్శన కనపరిచిన వెంకటాపురం జట్టుకు అభినందనలు తెలియజేస్తూ క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు బచ్చు వెంకటరమణ, బట్ట విజయ్ గాంధీ, గ్రామ అధ్యక్షుడు బారాసు సంపత్, చాప ముత్తయ్య, వంక సత్యనారాయణ, సామకూరి వెంకన్న,గొల్లపల్లి నరేష్ కుమార్, కోలా శశికాంత్, ఉమ్మడి తుమ్మల చెరువు యూత్ కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు

# ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన

■ షరతులు లేకుండా స్కిల్ మాట్రిక్స్‌ని వెంటనే అమలు చేయాలి



**బూర్గంపాడు ఏప్రిల్ 2 నవభూమి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక గ్రామంలో గల ఐటీసీ పరిశ్రమలో బుధవారం ఏఐటియుసి గౌరవ అధ్యక్షుడు సింగమనేని ప్రసాద్, గౌరవ సలహాదారు తన్నేరు వెంకటేశ్వర్లు, కాంట్రాక్టు కార్మికుల ప్రధాన కార్యదర్శి షేక్ జహూర్, సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాయల్ నవీన్ ల ఆధ్వర్యంలో పి ఎం 6 గేటు వద్ద నల్ల బ్యాడ్జీలు, ప్ల కార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కాంట్రాక్టు కార్మికుల పట్ల యాజమాన్యం మొండిగా ఉందని విడతల వారిగా స్కిల్ మాట్రిక్స్ చేసిన ప్రక్రియను తొలగించి పూర్తి తరహాలో అర్హులైన ప్రతి ఒక్క కాట్రాక్ట్ కార్మికుడికి స్కిల్ మాట్రిక్ అమలుపరచాలని కాంట్రాక్ట్ కార్మికులందరూ ఐక్యతతో నిరసన తెలియజేశారు. ప్రతి ఒక్క కార్మికుడు తన జేబుకు నల్ల బ్యాడ్జిని ధరించి వారి శ్రమకు తగిన ఫలితం అందడం లేదని యాజమాన్యానికి వ్యక్తపరిచారు. నల్ల బ్యాడ్జీల నిరసన కార్యక్రమంలో ప్లకార్డ్స్ పట్టుకొని విడతలవారీగా స్కిల్ మాట్రిక్స్ మాకొద్దు. షరతులు లేని స్కిల్ మాట్రిక్స్ వెంటనే అమలు చేయాలి. కాంట్రాక్టు కార్మికుల పట్ల యాజమాన్యం మొండి వైఖరి నశించాలి అంటూ నినాదాలు చేశారు. ఏఐటీయూసీ యూనియన్ కార్మికుల కష్టం నుండి పుట్టిందని కార్మికులకు ఎప్పుడు ఏఐటీయూసీ యూనియన్ సాయంగా అండగా ఉంటుందని సింగమనేని ప్రసాద్ తెలియజేశారు. ప్రస్తుతం కార్మికులు పొందుతున్న హక్కులన్నీ గతంలో ఏఐటీయూసీ యూనియన్ సాధించిన దేనని రాబోవు కాలంలో కూడా అది కేవలం ఐఎన్టియుసి యూనియన్ కు మాత్రమే సాధ్యమని మరొకసారి గుర్తు చేశారు. నల్ల బ్యాడ్జీలు మరియు ప్లకార్డుల నిరసన కార్యక్రమంలో ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు సింగమనేని ప్రసాద్, గౌరవ సలహాదారు తన్నేరు వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు స్వామి గౌడ్, కాంట్రాక్ట్ కార్మికుల అధ్యక్షుడు బల్లెం నాగయ్య, ప్రధాన కార్యదర్శి షేక్ జహూర్, సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాయల నవీన్, ప్రజానాట్యమండలి సీనియర్ శ్రీనివాస్ చారి, జాయింట్ సెక్రటరీలు పి ఉపేందర్, అనిల్ శర్మ, గౌతమ్, జయప్రకాష్, తోకల నరేష్, పేరాల సుమంత్, బి వినోద్, లక్ష్మి, మరియు కార్యదర్శులు కార్యవర్గ సభ్యులు అధిక సంఖ్యలో కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు

## పెద్దమ్మ గుడిలో ఘనంగా నాల్గవ రోజు శ్రీదేవి వసంత నవరాత్రులు





**పాల్వంచ టౌన్ ఏప్రిల్ 2 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం కేశ్వాపురం-జగన్నాధపురం గ్రామంలో వెలిసియున్న శ్రీ కనకదుర్గ దేవస్థానం ( పెద్దమ్మ గుడి) లో బుధవారం శ్రీ అమ్మవారి వసంత నవరాత్రోత్సవముల భాగంగా నాల్గవ రోజు వైభవంగా నిర్వహించారు. ఉదయం 5:00 గంటలకు సుప్రభాత సేవ ప్రాత: కాలార్చన, శ్రీ చక్రార్చన, సూర్య నమస్కారములు, చండీ సప్తసతీ పారాయణం, మహన్యాస పూర్వక, ఏ కా దశ రుద్రాభిషేకము, శ్రీ సూక్త పారాయణ, హెూమము, ఈ సందర్భంగా శ్రీ అన్నపూర్ణాదేవి, శ్రీ సరస్వతి దేవి అమ్మవార్లకు పంచామృతా భిషేకం నిర్వహించారు. అమ్మవార్లకు హారతి, మంత్రపుష్పం, మధ్యాహ్నం మహా నివేదన, అనంతరం 2:30 గంటల నుండి మల్లెపూలతో లక్ష సుమార్చన, శ్రీ లలితా సహస్ర నామ హవ నము నిర్వహించారు. సాయంత్రం 7:30 గంటలకు నీరాజన మంత్రపుష్పము, తీర్థ ప్రసాద వితరణ జరిపించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు దేవస్థాన అర్చకులు, రుత్వికులు, సిబ్బంది పాల్గొన్నారని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్. రజనీకుమారి తెలిపారు

## ముస్లిం మైనార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో, ముస్లిం యువతీ యువకులకు ఉచిత రాజీవ్ వికాస దరఖాస్తులు



**అశ్వాపురం ఏప్రిల్ 2 నవభూమి:** అశ్వాపురం మండల కేంద్రంలోని ముస్లిం మైనార్టీ మండల కమిటీ ముస్లిం మైనార్టీ మండల అధ్యక్షుడు ఎస్కే ఖదీర్ ఉచిత రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు ఉచితంగా మండల కమిటీ ఆధ్వర్యంలో రూబీ నా ఆన్లైన్ సెంటర్లో చేయబడును మండలంలో ఉన్న ముస్లిం యువతి యువకులు ఈ యొక్క అవకాశాన్ని వినియోగించుకోగలరని ముస్లిం మైనార్టీ మండల కమిటీ ద్వారా మండలంలో ఉన్న ముస్లిం యువతి యువకులకు కోరడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ మండల అధ్యక్షులు ఎస్కే ఖదీర్ జనరల్ సెక్రెటరీ ఎండి రఫీ ఖాన్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.కె హబీబ్ ఆర్గనైజర్ సెక్రెటరీ ఎండి అమర్ ట్రెజరర్ ఎస్.కె అబ్దుల్ రహీం జాయింట్ సెక్రెటరీ ఎస్కే అన్వారి తదితరులు పాల్గొన్నారు

## బహుజన రాజ్యాధికారం కోసం పాపన్న గౌడ్ పోరాటం స్ఫూర్తిదాయకం

**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 2 (నవభూమి ప్రతినిధి):** బడుగు, బలహీనవర్గాలకు రాజ్యాధికారాన్ని అందించిన భారతదేశపు తొలి బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని గౌడ సంఘం నేతలు అన్నారు. పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలను ఇబ్రహీంపట్నం గౌడ సంఘం అధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కేంద్రంలోని పాపన్న గౌడ్ విగ్రహానికి గౌడ సంఘం నాయకులు, బివిస్టీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు పాలకుర్ల ఐలేష్ గౌడ్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

# సన్న బియ్యం పంపిణీతో పేదల నుండి హర్షాతిరేకాలు

- రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల
- జగన్నాధపురంలో రేవంత్ రెడ్డి, మంత్రుల ఫ్లెక్సీకి పాలాభిషేకంలో పాల్గొన్న కొత్వాల





**పాల్వంచ ఏప్రిల్ 2 నవభూమి ప్రతినిధి:** తెలంగాణా లోని కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీతో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయని రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పాల్వంచ మండలం పరిధిలోని జగన్నాధపురం గ్రామం లోని చౌకదుకాణంలో చేపట్టిన సన్న బియ్యం పంపిణి కార్యక్రమాన్ని కొత్వాల పరిశీలించారు. సన్న బియ్యం పొందిన మహిళా లబ్దిదారులతో అయన మాట్లాడారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పౌరసరఫరాల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ల ఫ్లెక్సీకి సన్న బియ్యం లబ్దిదారులు, కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ సన్న బియ్యం పంపిణి పథకం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చే గొప్ప వరం మన్నారు. ప్రజలందరూ సన్న బియ్యం పంపిణి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న, సొసైటీ మాజీ డైరెక్టర్ చౌగాని పాపారావు, పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పైడిపల్లి మహేష్, కాంగ్రెస్ నాయకులు వై వెంకటేశ్వర్లు, గంధం నర్సింహారావు, భూక్యా గిరి ప్రసాద్ నాయక్, కందుకూరి రాము, కాపర్తి వెంకటాచారి, పిండి రామిరెడ్డి, తాళ్లూరి షణ్ముఖా చారి, అజ్మీరా రమేష్ నాయక్, ఉండేటి శాంతివర్ధన్, మాలోత్ చంద్రు, ధర్మపురి ప్రసాద్, ధర్మసోత్ బిచ్చా, బోడా లచ్చు, బూరుగడ్డ ఖాదర్ బాబు, సోని, అరుణ, భద్రమ్మ, మాలోత్ చెవిలో, మాలోత్ విజయ, ధర్మసోత్ వీరి, భూక్యా మంగమ్మ, గౌరిమియా, జల్లారపు రాములమ్మ, ఎనిగండ్ల నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

# ఏఐఎస్ఎఫ్ చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

- యూనివర్సిటీ భూముల వేలాన్ని విరమించుకోవాలి
- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫహీమ్ దాదా



**కొత్తగూడెం ఏప్రిల్ 2 నవభూమి ప్రతినిధి:** కొత్తగూడెం పట్టణ కేంద్రంలో ఏ ఐ ఎస్ ఎఫ్ ముఖ్య కార్యకర్త సమావేశం శేషగిరి భవన్ లో నిర్వహించాడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫహీమ్ దాదా పాల్గొని మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సంబంధించిన 400 ఎకరాల భూమి వేలాన్ని నిలిపివేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రేపు జరుగు చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అయన మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలాన్ని నిలిపివేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చలో సెక్రెటరీ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి అని పిలుపునిచ్చారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన 400 ఎకరాల భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం ఆక్రమించుకుని వేలం వేసేందుకు సిద్ధమైందని. కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడిదారుల దాహం తీర్చేందుకే భూముల అమ్మకానికి కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు అడుగులు వేస్తుంది. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం భూమిని ఎరగా చూపి ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు తాకట్టుపెట్టే హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని అయన అన్నారు. యూనివర్సిటీల అభివృద్ధికి కృషి చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా భూములనే కొల్లగొట్టేందుకు సిద్ధమైతే భవిష్యత్తులో యూనివర్సిటీలో ఉనికి ప్రమాదకరంగా మారుతుందని అన్నారు. ప్రభుత్వాల నుండి ఎదురయ్యే ప్రమాదకర పరిస్థితిలను గమనించిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు భవిష్యత్తులో ప్రయోగశాలలకు అవసరమైన భూములు చేజారిపోతే భవిష్యత్ తరాల విద్యార్థులకు యూనివర్సిటీ ఉనికికి ప్రమాదమని న్యాయబద్ధంగా భూముల రక్షణ కోసం పోరాటాన్ని కొనసాగిస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల గొంతు నొక్కి అక్రమ అరెస్టులకు పాల్పడుతుంది. కెసిఆర్ ను తల పించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన కొనసాగిస్తుంది. ఇలాంటి నియంతృత్వ విధానాలను కొనసాగించి విద్యార్థులని అని కూడా చూడకుండా పోలీసులతో దుశ్చర్యాలను కొనసాగిస్తుంది. సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల అక్రమ అరెస్టును అఖిల భారత విద్యార్థి సమైక్య భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి తీవ్రంగా ఖండిస్తుంది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నుండి పోలీసులు వెనకకు వచ్చే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. భూముల అమ్మకాన్ని విరమించుకోవాలి. లేనిపక్షంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని వంశీ హెచ్చరిస్తున్నామని అన్నారు కార్యక్రమంలో జిల్లా నాయకులు అజిత్,సృజన్, వంశీ,రణదీర్, వినయ్,గిరిప్రసాద్, నాగరాజు వెంకట్, విజయ్ కాంత్,తదితరులు పాల్గొన్నారు

# సైబర్ నేరాలపై అవగాహన అవసరం

■ సైబర్ క్రైమ్ డిఎస్పీ ఫణింధర్

**ఖమ్మం క్రైం, నవభూమి, ఏప్రిల్ 2:** ప్రస్తుత పరిస్థితులలో సైబర్ నేరాలపై మరింత అప్రమత్తంగా వుండాలని సైబర్ క్రైమ్ డిఎస్పీ సిహెచ్.ఆర్.వి. ఫణీందర్ అన్నారు. బుధవారం నగరంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజి విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ యాప్ ల ద్వారా డబ్బు, డేటా దోచుకుంటారని అన్నారు. బెట్టింగ్ గేము ముందుగానే ప్రణాళికాబద్ధంగా అమలు చేసి యూజర్ల గెలుపును ప్రోత్సాహిస్తారని, డబ్బు గెలిచినప్పటికీ ఉపసంహరించుకోవడానికి అనుమతించని మోసపూరిత నియమాలను విధించి, డబ్బు విత్ డ్రా చేసుకోలేకుండా చేస్తారని పెర్కొన్నారు. వాట్సాప్, ఇన్స్టాగ్రామ్, ఇమెయిల్, ఫేస్ బుక్ నకిలీ ఖాతాలు సృష్టించి వాటి ద్వారా టిక్కెట్లు ఆఫర్ లో తక్కువకే యిస్తున్నట్లు నమ్మిస్తారన్నారు. ముందుగా కొంత డబ్బు తీసుకుని, ఇంకొంత మొత్తం కడితేనే టికెట్స్ ఇస్తాము లేకుంటే లేదని, చివరికి బ్లాక్ మేల్ చేస్తారని అన్నారు. నేరస్తులు మీ బాస్, సీఈఓ, సహోద్యోగిలా నటించి, అత్యవసరంగా డబ్బు బదిలీ చేయాలని ఒత్తిడిచేయడం, సున్నితమైన కంపెనీ సమాచారం పొందేందుకు ప్రయత్నించడం, బ్యాంక్ఆ, ర్థిక సంస్థ మోసం, బ్యాంక్ ప్రతినిధిగా వ్యవహరించి, ఖాతా వివరాలు, ఓటీపీ లు ఇతర ఆర్థిక సమాచారం దొంగిలించేందుకు ప్రయత్నిస్తారన్నారు. ప్రభుత్వ ఏజెన్సీ నకిలీకరణ, ఆదాయ పన్ను శాఖ, పోలీస్, ఇతర అధికార సంస్థల ప్రతినిధిగా నటించి, జరిమానాలు ఇతర ఆర్థిక లావాదేవీల పేరుతో మోసం చేస్తారన్నారు. అటువంటి వారి పట్ల అప్రమత్తం గా ఉండాలన్నారు. ప్రసిద్ధ వ్యక్తులు, సోషల్



మీడియా ప్రభావకులు ప్రమోట్ చేస్తున్నారని గుడ్డిగా నమ్మకుండా వారు చెప్పే ప్రకటనలను పరిశీలించి, బెట్టింగ్ యాఫ్, ఆన్లైన్ బెట్టింగ్ విషయాలలో జాగ్రత్త వహించాలని సూచించారు. ఎల్లప్పుడు అధికారికమైన వెబ్సైట్లు, అప్లికేషన్ల ద్వారా మాత్రమే టికెట్లు కొనుగోలు చేయాలన్నారు. ఐపీల్ టికెట్ పేరుతో వచ్చే లింక్లను క్లిక్ చేయవద్దని అదేవిదంగా ఏపీకి లను డౌన్లోడ్ చేయవద్దన్నారు. వ్యక్తి యొక్క అధికారిక నంబరు కాల్ చేయండి. 1930, ఎన్ సీ ఆర్పీ పోర్టల్, గోల్డెన్ అవర్ ప్రాముఖ్యత. గురించి తెలియజేశారు, ఎవరైన సైబర్ క్రైమ్ భారీ పడితే 1930 కాల్ లేదా %షషష.ఛఎఎవతీఛతీఱఎవ.స్త్రశీజ.ఱఅ% ద్వారా ఫిర్యాదు చేయలని ఆయన సూచించారు.

ఈ కార్యక్రమములో సైబర్ క్రైమ్ ఎస్.ఐ. రంజిత్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ ఎం ప్రసాద్, ప్రభుత్వ వైద్య కళాశాల ఖమ్మం ప్రిన్స్ పాల్ డా.రాజేశ్వరావు, డా.సరిత, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జమలాపురం చెరువును పరిశీలించిన ఇరిగేషన్ ఎస్ఈ వాసంతి



**ఎర్రుపాలెం,నవభూమి, ఏప్రిల్ 2 :** మండల పరిధిలోని జమలాపురంపెద్ద చెరువును కల్లూరు ఇరిగేషన్ ఎస్ఈ వాసంతి బుధవారం డిఈ సాంబశివరావు తో కలిసిపరిశీలించారు.జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి,ఈవో కొత్తూరు జగన్మోహనరావు,ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో బ్రహ్మోత్సవాలు జరుగు తున్నాయని ఈనెల నాలుగో తేదీ శుక్రవారం స్వామివారి కళ్యాణం అనంతరం తెప్పోత్సవ కార్యక్రమం ఉంటుందని వేసవి కాలం కావడంతో చెరువులో నీరు లేదని నాగార్జునసాగర్ కాలువ ద్వారా నీరు వచ్చే ఏర్పాటు చేయాలని,ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు,ఇరిగేషన్ శాఖ ఈఈ రామకృష్ణ లకు వినతిపత్రం అందించారు. భట్టి విక్రమార్క ఆదేశాలతో ఆలయ అధికారుల వినతిని దృష్టిలో ఉంచుకొని జమలాపురం చెరువుకు పాలేరు నుండి కల్లూరు మేజర్ ద్వారా ఇరిగేషన్ అధికారులు నీటిని గత రెండు రోజులుగా విడుదల చేశారు.బుధవారం ఎస్ఇ వాసంతి,డిఇ సాంబశివరావు,ఏఈ లు రాజేష్,అనూష,ఇరిగేషన్ కార్యాలయ సిబ్బంది రవీందర్ తో కలిసి చెరువును పరిశీలించారు.చెరువు పూర్తిస్థాయిలో నిండటంతో స్వామివారి తెప్పోత్సవం నిర్వహించుకోవటానికి ఏర్పాట్లు చేసుకోవచ్చని ఆలయ అధికారులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎర్రుపాలెం సొసైటీ అధ్యక్షులు మూల్పూర్ శ్రీనివాసరావు,గ్రామస్తులు పాల్గొన్నారు

# వసతి గృహాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

**గార్ల, నవభూమి, ఏప్రిల్ 2:** మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ గార్ల మండలంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, కస్తూరి బా గాంధీ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, ఎస్.సి బాలికల, బాలుర వసతి గృహాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్టోర్ గదిని, డైనింగ్ హాలు, క్లాస్ రూంలు పరిశీలించి అధికారులు, వంట వండే సిబ్బందికి పలు సూచనలు చేయడం తో పాటు విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆదేశించారు. నాసిరకం, నాణ్యతాలేమితో కూడిన పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లో వినియోగించకూడదని ఆదేశించారు. విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చదువు కొనసాగించేలా అనుకూల పరిస్థితులు కల్పించాలని అధికారులు ఆదేశించారు. మల మూత్ర శాలలను పరిశీలించి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉండాలని ఆదేశించారు. వేసవి కాలం దృష్ట్యా విద్యార్థులకు నీటి కొరత లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, ఇబ్బంది కలుగాకుండా చూడాలన్నారు విద్యార్థులతో మాట్లాడి ప్రత్యేక శిక్షణ, తరగతుల నిర్వహణ, ప్రశ్న, జవాబు పత్రాల నమూనాలపై అవగాహన, మధ్యాహ్న భోజనం, తదితర విషయాలపై విద్యార్థులను ఆరాతీశారు. విద్యార్థుల చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని బోధనా సిబ్బందికి సూచించారు. విద్యార్థుల



వ్యక్తిగత, పరిశుభ్రత, మానసిక వికాసం కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించి వారిని గమనిస్తూ అవగాహన కల్పించాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని అధికారులకు హెచ్చరించారు. ఈ తనిఖీ లో వసతి గృహాల ప్రిన్సిపాళ్లు, వార్డెన్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ఎమ్మెల్యే కోరం కనకయ్యకు ఘన సన్మానం

### తాసిల్దార్, ఎంపీడీవోకు సత్కారం



**కామేపల్లి, నవభూమి,ఏప్రిల్ 2 :** కామేపల్లి మండలం జాస్తిపల్లి గ్రామంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య,తా సిల్దార్ సిహెచ్ సుధాకర్, ఎంపీడీవో జీ.రవీందర్ లను శాలువా కప్పి బుధవారం ఘనంగా సన్మానించారు. గ్రామంలో సన్న బియ్యం పం పిణీ కార్యక్రమానికి విచ్చేసిన వారిని ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా కార్యదర్శి బత్తుల రాంబా బు,సీనియర్ మేట్,మండల అధ్యక్షులు రాయల వీరన్న సత్కరించి వారి సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమం లో పవన్ కళ్యాణ్ అభిమాన సంఘం రాష్ట్ర కార్యవర్గ స భ్యుడు రాయల నరేష్, ఇల్లందు నియోజకవర్గ సోషల్ మీడియా ఆర్గనైజేషన్ అధ్యక్షుడు గుండ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సెంట్రల్ యూనివర్సిటీ భూముల అమ్మకాలను విరమించుకోవాలి

■ ఉద్యమకారులపై పెట్టిన అక్రమ కేసులను బేషరతుగా ఎత్తివేయాలి

■ సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు డిమాండ్

**ములకలపల్లి ఏప్రిల్ 2 నవభూమి:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను అమ్మకానికి పెట్టె ప్రయత్నాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రహదారిపై నిరసన కార్యక్రమం తెలియజేసినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సెంట్రల్ యూనివర్సిటీ 400 ఎకరాల భూములను కార్పొరేట్ దారులకు అప్పజెప్పే ప్రయత్నం వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. సెంట్రల్ యూనివర్సిటీ అప్పటి భారత ప్రభుత్వం యూనివర్సిటీ అభివృద్ధికి కేటాయించిందని ఈ భూములకు ఎంతో ప్రత్యేకత ఉందని ఈ భూములను యూనివర్సిటీ అభివృద్ధికే ఉపయోగించాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ భూములను అమ్మకానికి పెడితే భూముల్లో ఉన్న పెద్ద పెద్ద వృక్షలు, జంతువులు, పక్షులు



విలవిల్లాడుతున్నాయని అన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలియజేసే హక్కు ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం అధికమించి నిరసన తెలియజేస్తూన్న విద్యార్థులను పోలిస్ లు జుట్టు పట్టుకుని ఈడ్చుకుంటూ అత్యంత కర్కశంగా ఉద్యమకారులపై దాడులు చేస్తూ పోలీసులు వ్యవహరించారని ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి ఉద్యమకారుల పై పెట్టిన అక్రమ కేసులను బేషరతుగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు నిమ్మల మధు, వర్షా శ్రీరాములు, సోయం కృష్ణ, గడ్డం వెంకటేశ్వర్లు, బైటి పొట్టి, ముదిగొండ రమాదేవి, సంధ్య, బిబినేని చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# మే 20న కార్మికుల సమ్మెను జయప్రదం చేయండి

**వీవనగండ్ల ఏప్రిల్ 3 నవభూమి–** సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) వీవనగండ్ల మండల ముఖ్య కార్యకర్తల సమావేశం బస్టాండ్ ఆవరణలో సిఐటియు మండల నాయకులు జక్కుల ఆశన్న అధ్యక్షతన నిర్వహించిన.ఈ సమావేశానికి సిఐటియు వనపర్తి జిల్లా అధ్యక్షులు మండ్ల రాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని కార్మికులు సమ్మెలు పోరాటం చేస్తున్న సందర్భంగా వారి దగ్గరకు వచ్చి అనేక హామీలు ఇస్తున్నారని అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వ విధానాలనే అవలంబిస్తున్నారని వారు విమర్శించారు

# చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఆర్.కిరణ్ రాజ్ కుమార్



**కొత్తగూడెం ఏప్రిల్ 2 నవభూమి ప్రతినిధి:** రామగుండం ఏరియా హాస్పిటల్ లో ఏసిఎంఓ గా పనిచేస్తూ ఇటీవల సింగరేణి సంస్థ చీఫ్ మెడికల్ ఆఫీసర్ గా నియమితులైన డాక్టర్ ఆర్.కిరణ్ రాజ్ కుమార్ బుధవారం కొత్తగూడెం సింగరేణి ప్రధాన ఆస్పత్రిలో సీఎంఓ గా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏసిఎంఓ ఎం.ఉష, డివై.సిఎంఓ జి.సునీల, డాక్టర్లు, సిఎంఓఏఐ ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, యూనియన్ నాయకులు డాక్టర్ కిరణ్ రాజ్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# హెచ్‌సియు ఘటన అప్రజాస్వామికం: సిపిఎం



**జూలూరుపాడు, ఏప్రిల్ 02 (నవభూమి ప్రతినిధి)** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ హెచ్ సి యు విద్యార్థులపై కాంగ్రెస్ ప్రభుత్వ నిర్బంధకాండను వ్యతిరేకిస్తూ బుధవారం మండల కేంద్రంలో సి పి ఎం పార్టీ అధ్వర్యంలో ప్రధాన రహదారిపై అంబేద్కర్ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి యాస నరేష్ మాట్లాడుతూ సెంట్రల్ యూనివర్సిటీలో దాదాపు 400 ఎకరాలు పచ్చని అడవిని నాశనం చేయవద్దని భూమిని వేలం వేసి బడా కార్పొరేట్ పెట్టుబడిదారులకు దారదత్తం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. యూనివర్సిటీ భూమిని కాపాడాలని శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై లాఠీ ఛార్జ్ చేసి అక్రమ కేసులు పెట్టడం అప్రజాస్వామికమని మండిపడ్డారు. యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం ఉద్యమంలో పోలీసుల లాఠీచార్జి లో గాయపడిన విద్యార్థులను పరామర్శించడం కోసం వెళ్లిన సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అక్రమ అరెస్టు కూడా ఖండిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు వి చందర్ రావు,గార్లపాటి వెంకట్, పెరుమళ్ళ వెంకటేశ్వర్లు, జెల్లిక రాధాకృష్ణ,ఆనగంటి సత్యనారాయణ, గడిదేశి కనకరత్నం,బోడ అబిమిత్ర,బొల్లు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

### నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు దినాకర్, క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ

**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 2 (నవభూమి ప్రతినిధి) :** పాస్టర్ ప్రవీణ్ పగడాల హత్యపై సమగ్ర విచారణ జరిపించాలని ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పాస్టర్ దినాకర్ డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలో పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి సంతాపంగా బుధవారం నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీని నిర్వహించారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన క్రైస్తవ మత బోధకుడు పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి పట్ల నియోజకవర్గ, మండల పాస్టర్లు, సంఘస్తులు నిరసన వ్యక్తం చేస్తూ, తమ సంతాపాన్ని తెలిపారు.

## ఏప్రిల్ నెలాఖరు నాటికి మండల

# కార్యాలయాలను ప్లాస్టిక్ రహితం చేయాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- క్రమపద్ధతిలో ప్రభుత్వ కార్యాలయాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలి
- చలివేంద్రాల సమర్థ నిర్వహణకు చర్యలు
- ప్లాస్టిక్ నియంత్రణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్






**ఖమ్మం కలెక్టరేట్, నవభూమి, ఏప్రిల్ 02 :** ఏప్రిల్ నెలాఖరు నాటికి మండల కార్యాలయాలను ప్లాస్టిక్ రహితం చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి ప్లాస్టిక్ నియంత్రణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ మండలాల్లో తహసిల్దార్, ఎంపిడిఓ కార్యాలయాలు ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఏప్రిల్ తర్వాత మండల స్థాయి కార్యాలయాల్లో ఎక్కడా ప్లాస్టిక్ వాడ వద్దని కలెక్టర్ తెలిపారు. మండలంలో కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన చలి వేంద్రాల నిర్వహణను నిరం తరం పర్యవేక్షించాలని, ప్రతి రోజు త్రాగునీటి సరఫరా నాణ్యత తనిఖీ చేయాలని అన్నారు. గ్రామాలలో, మున్సిపాలిటీలలో బస్ స్టాప్, ఆటో స్టాండ్ ల వద్ద తప్పనిసరిగా చలివేంద్రాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ కార్యాలయంలో ప్రజలతో ఇంటరాక్ట్ అయ్యే సమయంలో అధికారులు ఓపికతో ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో డిఆర్డీవో సన్యాసయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఇంచార్జ్ ఇడి నవీన్ బాబు, బిసి సంక్షేమ అధికారి జ్యోతి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి విజయలక్ష్మి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి డా. బి. పురంధర్, ఎల్డిఎం శ్రీనివాస రెడ్డి, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మండల ప్రత్యేక అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## భద్రాచలం పట్టణ సమస్యల

# పరిష్కారానికి ముఖ్యమంత్రి చొరవ చూపాలి

- సిఐటియు ఆధ్వర్యంలో ఒకరోజు రిలే నిరాహార దీక్ష






**భద్రాచలం ఏప్రిల్ 2 నవభూమి ప్రతినిధి:** స్థానిక అంబేద్కర్ సెంటర్ నందు, సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన భద్రాచలం సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న ఒకరోజు నిరాహార దీక్షకు సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వివిధ రంగాల కార్మికులు మద్దతు తెలుపుతూ ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కన్వీనర్ ఎంబి నర్సారెడ్డి మాట్లాడుతూ భద్రాచల%శీ% పట్టణం పట్ల ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న గాని వివక్షతను చూపిస్తున్నారని, ఈ విధాన%శీ% పోవాలని, ప్రధానంగా భద్రాచలం సుభాష్ నగర్ కాలనీ వైపు నిర్మిస్తున్న కరకట్టను తక్షణమే పూర్తి చేయాలని, రాబోయేది వర్షాకాలం అయినందున వెంటనే దాని నిర్మాణం పూర్తి చేయాలని, అలాగే భద్రాచలానికి అనుకొని ఉన్న ఐదు గ్రామపంచాయతీలను, తెలంగాణలో కలపాలని, ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ ను సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ గా రూపుదిద్దాలని, భద్రాచల పట్టణానికి ఒక ప్రత్యేక ప్యాకేజీ ద్వారా నిధులు మంజూరు చేయాలని, భద్రాచల రామాలయాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన రామాయణం సర్క్యూట్ లో చేర్చాలని, పోలవరం ముంపు ప్రమాదం పొంచి ఉన్న భద్రాచలానికి నిర్దిష్టంగా ఎంత పరిధి నీరు వస్తుందని తెలిపే వివరాలను బయటపెట్టాలని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం భద్రాచల అభివృద్ధికి ఒక ప్రత్యేక ప్యాకేజీని కేటాయించాలని, శ్రీరామనవమి కి వచ్చుచున్న ముఖ్యమంత్రి వీటిని ఆ సందర్భంగా ప్రకటించాలని, సిపిఎం పార్టీ సూచించిన డిమాండ్లను సిఐటియు సమర్థిస్తున్నదని, ఈ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే దానికోసంసిఐటియు రంగాల కార్మికులు కూడా కృషి చేస్తారని ఈ సందర్భంగా తెలియజేసినారు. కావున రాబోయే కాలంలో భద్రాచలానికి జరిగే అన్యాయాన్ని ఎండ గ డుతూ ఇక్కడ గెలిచిన ఎమ్మెల్యే ఎంపీలు ఎవరు న్నా సిఐటియు కార్మిక వర్గం పోరాడుతుందని తెలియజేసినారు. ఈ నిరాహార దీక్షకు సిఐటియు జిల్లా కార్యదర్శి ఏ జె రమేష్ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఏరియా హాస్పిటల్ నాయకులు రమాదేవి, కుమారి, జిసిసి హమాలి నాయకులు ప్రసాద్, సుబ్రహ్మణ్యం, లోకేష్, శేషు, ముత్తయ్య, కార్పెంటర్ యూనియన్ నాయకులు చాట్ల శ్రీను, చారి, టెంపుల్ చిరు వ్యాపారుల నాయకులు, డి రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు

# సంక్షేమ పథకాలలో విలేకరులకు అవకాశమివ్వండి

## వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ నాయకుల విజ్ఞప్తి



**జూలురుపాడు,ఏప్రిల్ 02 (నవభూమి ప్రతినిధి)-** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వివిధ పథకాలలో అర్హులైన వర్కింగ్ జర్నలిస్ట్ లను లబ్ధిదారులు గా ఎంపిక చేయాలని మండల వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం మాచినేని పేట లో ఒక కార్య క్రమానికి హాజరైన వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ కు సంఘం అధ్యక్షులు ఉరిమెళ్ల పూర్ణ చందర్ రావు విజ్ఞాపన పత్రం అందజేశారు.స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో విలేఖరులు పోషించిన పాత్ర గణనీయమైనదని ప్రశంసించారు.ప్రజా పాలన ఏర్పాటు జర్నలిస్ట్ ల కృషి తోనే సాధ్యమైందని తెలిపారు.వారికి ప్రభుత్వ పథకాలైన ఇందిరమ్మ ఇళు ్ల,రాజీవ్ యువ వికాసం లో ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు.ఆమేరకు చర్యలు తీసుకోవాలని తహశీల్దారుకు సూచించారు.ఈ కార్య క్రమంలో సంఘం నాయకులు మోదుగు ప్రభాకర్,షేక్ సిద్దిక్,సంఘం నాగరాజు, మోదుగు ఆదమ్ పాల్గొన్నారు

# వెంకటేశ్వరస్వామి కళ్యాణానికి రావాలని కలెక్టర్‌కు ఆహ్వానం





**ఏర్రుపాలెం, నవభూమి, ఏప్రిల్ 2:** తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం జమలాపురం నందు నిర్వహించబడు చున్న శ్రీ విశ్వవసు నామ సంవత్సర వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 4 తేదీశుక్రవారం నిర్వహించబడు శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి కళ్యాణమహోత్సవమునకు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్,అడిషనల్ కలెక్టర్ పి శ్రీనివాస్ రెడ్డిని ఆలయ కార్యనిర్వాహణాధికారి కొత్తూరు జగన్ మోహన్ రావు బుధవారం ఖమ్మంలోని వారి కార్యాలయాలలో మర్యాదపూర్వ కంగా కలిసి స్వామివారి కల్యాణమునకు రావాలనిఆహ్వానించారు.ఈ కార్యక్రమం లో దేవాదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ ఎం వీరస్వామి, జమలపురం ఆలయ సిబ్బంది,అర్చకులు పాల్గొన్నారు

# మాజీ ఎమ్మెల్యే వనమా స్థాయిని మించి మాట్లాడుతున్నారు

- 4 అడుగులు వేయలేని, 4 మాటలు మాట్లాడలేని వనమా
- సీఎంపై విమర్శలు చేయడం విడ్డూరం
- హెచ్‌సియూ భూముల విషయంలో తప్పుడు ప్రచారం తగదు
- కాంగ్రెస్ పార్టీపై బురద చల్లే ప్రయత్నం చేస్తే సహించేది లేదు
- కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కోనేరు సత్యనారాయణ



**కొత్తగూడెం ఏప్రిల్ 2 నవభూమి ప్రతినిధి:** కంచె గచ్చిబౌలిలో అంతర్జాతీయ సంస్థలు తెచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సిఎం రేవంత రెడ్డి ప్రయత్నం చేస్తుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కోనేరు సత్యనారాయణ అన్నారు. కొంత మంది రాజకీయ కుట్రతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. యూనివర్సిటీలో ఇంచు భూమిని సైతం ముట్టుకోమని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. చుంచుపల్లి మండలంలోని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అబద్ధాల మీద బతుకుతున్న కొన్ని రాజకీయ పార్టీలు ప్రజలకు తప్పుడు సమాచారం ఇస్తూ కాంగ్రెస్ పార్టీపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. 400 ఎకరాల యూనివర్సిటీ భూమిని ప్రభుత్వం లాగేసుకుంటున్నట్లు దుష్ప్రచారం జరుగుతోందని, వాస్తవాలు ప్రజలకు తెలియాలని స్పష్టం చేశారు. 2004లో 400ఎకరాలను ఐఎంజీ భారత్‌కు అప్పటి ప్రభుత్వం అప్పగించిందని, దానికి బదులుగా అప్పటి ప్రభుత్వం గోపన్‌పల్లిలోని 397 ఎకరాలు హెచ్‌సియూకి ఇచ్చిందని గుర్తుచేశారు. బిల్లీ రావుకు చెందిన ఐఎంజీ భారత్ అనే ఫ్రాడ్ కంపెనీకి ఇచ్చిన భూ ఒప్పందాన్ని 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని అన్నారు. ఆ సంస్థ కోర్టుకు వెళ్లగా ప్రజల ఆస్తి ప్రజలకే ఉండాలని ప్రభుత్వం పోరాటం చేసిందన్నారు. సిఎం రేవంత్ ప్రభుత్వం కొట్లాడి కేసు గెలిచిందని వెల్లడించారు. బిఆర్ఎస్ నాయకుడు వనమా స్థాయి మరిచి మాట్లాడుతున్నారని, రౌడీలు ఎవరో తెలుసని, అవినీతి, అక్రమాలకు పాల్పడ వాళ్ళ గురించి ప్రజలకు తెలుసని ఎద్దేవా చేశారు. దళితబంధు పేరిట రాంబంధువుగా మారి అమాయక దళిత ప్రజలను మోసం చేసిన చరిత్ర మీదని విమర్శించారు. కొడుకు అక్రమాలకు కుటుంబాలే బలయ్యాయని, కాంగ్రెస్ భిక్షతోనే నేడు ఈ స్థాయిలో ఉన్నారని మరవకూడదని హితవు పలికారు. సరిగ్గా నాలుగు అడుగులు నడవలేరు, నాలుగు మాటలు మాట్లాడలేని స్థితిలో ఉన్న మనమా సిఎం రేవంత్ రెడ్డి పై వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందంటూ ఎద్దేవ చేశారు. ఇక మీద కాంగ్రెస్ పార్టీ పై బురద జల్లే ప్రయత్నం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు దేవిప్రసన్న, రైల్వే బోర్డు మెంబర్ వై శ్రీనివాస్ రెడ్డి, మండే హనుమంతరావు, జిల్లా యువనజ కాంగ్రెస్ అధ్యక్షుడు చీకటి కార్తీక్, నియోజకవర్గ అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, నాయకులు సుందర్‌రాజు, రావి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులనకు నిరసనగా రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం



**ఎర్రుపాలెం,నవభూమి,ఏప్రిల్ 2 :** ప్రజా పోరాటాలపైన నిర్బంధం విధిస్తూ అక్రమ అరెస్టులు చేస్తున్న దానిపై నిరసనగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం దగ్ధం చేశారు.హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల మీద,ఎస్ఎఫ్ఐ విద్యార్థి,డివైఎఫ్ఐ యువజన నాయకుల మీద పోలీసుల నిర్బంధాన్ని సిపిఎం మండలకమిటీతరఫునతీవ్రంగా ఖండిస్తూ ప్లే కార్డ్స్ తో ఎర్రుపాలెం రింగ్ సెంటర్ నందు బుధవారం కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన తెలిపారు.మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్ రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వీరయ్య మాట్లాడుతూ హెచ్ సీయు భూముల రక్షణ కోసం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో హెచ్ సియు గేటు ముందు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించాల్సిన ధర్నాకు వెళ్లకుండా ముందస్తుగా సిపిఎంపార్టీ నాయకత్వాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడి కక్కడ అక్రమంగా అరెస్టుచేయడాన్నిఅన్ని వర్గాల ప్రజలు,ప్రజాస్వామ్యవాదులు వ్యతిరేకించాలని అన్నారు.ప్రతి పక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ నాయకులు అనేక మాయమాటలు చెప్పారని అధికారం చేపట్టాక గత ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలనే ఈప్రభుత్వం అనుసరిస్తుంద ని విమర్శించారు.తమప్రభుత్వ మనుగడ కోసం ప్రభుత్వ భూములను అమ్ము కోవడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ ఎస్ఎఫ్ఐ నాయకత్వంలో గత కొద్ది రోజులుగా విద్యార్థులు పోరాడుతున్నారని అన్నారు.మంగళవారం పెద్ద ఎత్తున పోలీసులు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తూర్పు క్యాంపస్‌లోకి బుల్ డోజర్లతోప్రవేశించడాన్ని ఖండించారు.ప్రభుత్వ భూములు అమ్మొద్దన్నా విద్యార్థులనుఅరెస్టుచేసి,పోలీస్ స్టేషన్లలో నిర్బంధించిమరోసారిఆందోళన చేయబో మని అంగీకరిస్తూ వీడియో చేస్తేనే విడుదల చేస్తామని ఒత్తిడి చేయడం అభ్యంతరకరం,అప్రజాస్వామికమని దీనిని ప్రతి ఒక్కరు ఖండించాలని అన్నారు.ప్రజాస్వామ్య పునరుద్ధరణ తన ఏడవ గ్యారెంటీగా ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంత అప్రజాస్వామికంగా వ్యవహరించడాన్ని ఖండిస్తున్నామని అన్నారు.విద్యార్థుల మీద కేసులు ఉపసంహరించకోవాలని,అరెస్టు చేసిన విద్యార్థులను,సిపిఎం నాయకత్వాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు దూదిగం బసవయ్య,ఆంగోతు వెంకటేశ్వర్లు,సగ్గుర్తి సంజీవరావు,శాఖ కార్యదర్శులు గొల్లపూడిపెద్దకోటేశ్వరరావు, కూడలి నాగేశ్వరరావు,షేక్ మస్తాన్, లగడపాటి అప్పారావు,కోటి సుబ్బారెడ్డి, నక్క పుల్లారావు,గొబ్బూరి కృష్ణార్జునరాజు, నాగేశ్వరావు,షేక్ నాగుల్ పాల్గొన్నారు.

## జెఎన్ టియుహెచ్ అడ్మిషన్

# నూతన డైరెక్టర్‌గా ప్రొఫెసర్ బి.బాలు నాయక్

- శుభాకాంక్షలు తెలిపిన బంజారా విద్యార్థి సంఘం నాయకులు

**కూకట్‌పల్లి, ఏప్రిల్ 02, (నవభూమి ప్రతినిధి) :** జెఎన్ టియుహెచ్ యూనివర్సిటీ లో నూతనంగా నియమితులైన అడ్మిషన్ డైరెక్టర్ గా మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ బి.బాలు నాయక్ బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బంజారా విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్దులు వారి ఛాంబర్ లో కలిసి పూల కుండిని అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. బంజారా విద్యార్థి సంఘం నాయకులు భాను ప్రకాశ్ నాయక్, ఆకాశ్ నాయక్ లు మాట్లాడుతూ.. జెఎన్ టియుహెచ్ యూనివర్సిటి లో సీనియరిటీ నీ గుర్తించి సీనియర్ ప్రొఫెసర్ కు డైరెక్టర్ గా నియమించిన వైస్ ఛాన్సలర్ టీ.కిషన్ కుమార్ రెడ్డి కి బంజారా విద్యార్థి సంఘం తరుపున, బంజార విద్యార్థుల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. యూనిర్సిటీలో అడ్మిషన్ లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించి, పిహెడ్ అడ్మిషన్ లో మిగిలిన పిహెడ్ సీట్లు బ్యాక్లాగ్ చేసి తరువతి నోటిఫికేషన్ లో ఇస్తే ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ విద్యార్థులకు న్యాయం చేసిన వారవుతారని అడ్మిషన్ డైరెక్టర్ ని కోరారు.

## వైభవంగా బ్రహ్మోత్సవాలు, ఘనంగాఅష్టోత్తర కలశాభిషేకం







**ఏర్రుపాలెం, నవభూమి, ఏప్రిల్ 2 :** కలియుగ ప్రత్యక్ష దైవం జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామివారి సన్నిధిలో జరుగుతున్న బ్రహ్మోత్సవముల కార్యక్రమంలో భాగంగా మూడవరోజు బుధవారం ప్రాతఃకాల అర్చనలు, అభిషేకములను ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో వేద పండితులుఘనంగా నిర్వహించారు.స్వామివారి సన్నిధిలోని గోశాల వద్ద ఉప ప్రధానార్చకులు మురళీమోహన్ శర్మ,రాజీవ్ శర్మ దంపతుల ఆధ్వర్యంలో గోపూజ ఘనంగా నిర్వహించారు.ఉదయం10 గంటల నుండి స్వామివారి కలిసస్థాపన చేసి పాదములకు అష్టోత్తర కలశాభిషేకం అత్యంత వైభవంగా నిర్వహించారు.శ్రీ స్వామివారు ఈ కొండపై వెలిసినారు అనుటకు సాక్షిభూతమైన పరమ పవిత్ర మైన శ్రీవారిపాదములకు పంచామృత ములు,పండ్ల రసములతో అభిషేకం నిర్వహించారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదములను స్వీకరించరు. స్వామివారిని దర్శించుకున్న భక్తులంద రికీఅన్నదాన వితరణచేశారు.సాయంత్రం 6గంటలనుండి పద్మావతిఅలివేలుమంగా సమేతుడై శ్రీవారుగజవాహనంపై ఊరే గింపుగాజమలాపురం గ్రామానికి చెందిన శ్రీ వెంకటేశ్వర కోలాట బృందం సభ్యుల కోలాటం,భక్తుల గోవిందనామ స్వరల మధ్య గిరిప్రదక్షిణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం విజయవాడ కు చెందినచిన్నారులు చేసినభరతనాట్యం ప్రేక్షకులను ఆకట్టుకుంది.ఈకార్యక్రమంలో ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్ర మూర్తి, సూపర్నెంట్ కె విజయ కుమారి,వేద పండితులు విజయ కృష్ణ,సాయిఅభిలాష్, అర్చకులు వెంకటరమణ,రఘురామకృష్ణ శాస్త్రి,చక్రధర్,రామకృష్ణ శాస్త్రి,సిబ్బంది, గ్రామస్తులు,భక్తులు పాల్గొన్నారు

## పాలకుల వెన్నులో వణుకు పుట్టించిన

# తొలి తెలంగాణ తేజం సర్దార్ పాపన్న

■ అదనపు కలెక్టర్ వేణుగోపాల్





**కొత్తగూడెం ఏప్రిల్ 2 నవభూమి ప్రతినిధి:** హస్తినా పాలకుల వెన్నులో వణుకు పుట్టించిన తొలి తెలంగాణ తేజం గోల్కొండ కోట పై మొగలాయిల పెత్తనాన్ని ధిక్కరించి తమ సమాజ స్థాపనకు ప్రాణాలను ఫణంగా పెట్టిన వీరుడు, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అన్నారు.బుధవారం కలెక్టరేట్ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా కార్యాలయం సిబ్బంది సమక్షంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించిన అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన,పేద ప్రజల పాలిట ఆపద్బాంధవుడు,సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని, క్షత్రియుడే కత్తి పట్టాలన్న సూత్రాన్ని ఓ యోధుడు మార్చాడని. సబ్బండ వర్ణాల బలగంతో రాజ్యాధికారం సంపాదించాడని ఆయన అన్నారు. రాజ్యాధికారం గురించి ఆలోచించడమే పాపమైన కాలంలో సింహాసనాన్ని అదీ ష్టించిన బహుజన చక్రవర్తి నవాబుల సుబేదారిగా మారిన అగ్రవర్ణ దోపిడీ వ్యవస్థ పై తిరుగుబాటు చేసిన ధైర్యశాలి అని అన్నారు.17వ శతాబ్దంలోనే తెలంగాణ గడ్డపై పోరు విత్తనాలు నాటిన విప్లవకారుడు,బలహీన వర్గ కుటుంబంలో పుట్టి రాచరిక పునాదులను కదిలించిన ధీరధాతుడు సర్వాయి పాపన్న గౌడ్ అని, తెలంగాణ పౌరుషాన్ని పోత పోసుకున్న సర్వాయి పాపన్న వరంగల్ జిల్లా కిలాసపూర్ లో జన్మించాడని తండ్రి చిన్నప్పుడే మరణించడంతో తల్లి సర్వస్వమై పాపన్న పెంచి, రాచరిక వ్యవస్థ నీడలో జమీందారులు, జాగిర్దారులు, భూస్వామ్య దొరలు సాగిస్తున్న అరాచకాలను ప్రత్యక్షంగా చూసి, అతని కులవృత్తిని వదిలిపెట్టి, ప్రజల కోసం మొత్తం బహుజన కులాలను ఏకం చేసి గేరిల్లా సైన్యాన్ని తయారుచేసి, అగ్రకుల భూస్వాములు, వ్యాపారుల గడిలపై దాడి చేసి ఆ సంపదను బహుజన పేదలకు పంచి ఇచ్చాడని, అలాగే గదిలో బందీలుగా మగ్గుతున్న అణగారిన కులాల ప్రజలను విడిపించి, చిన్నచిన్న సంస్థానాలను ఆక్రమించి రాజ్యాన్ని విస్తరించాడని, స్వయం సమృద్ధి కోసం ఎన్నో సంస్కరణలు చేశాడని, కులవృత్తులను ప్రోత్సహించి వేలాది ఎకరాల్లో తాటి, ఈత, జిలుగు చెట్లను నాటించాడని, దక్కన్ సామ్రాజ్యంపై ఢిల్లీ పెత్తనాన్ని ధిక్కరించి, గోల్కొండ కోటపై బహుజన స్వాతంత్ర బహుట ఎగరవేసిన సర్దార్ పాపన్న పోరాటం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారిని ఇందిరా,తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యంతోనే ప్రజా అభివృద్ధి సాధ్యం

■ మండలంలో సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించిన

■ వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్





**జూలురుపాడు,ఏప్రిల్ 02 (నవభూమి ప్రతినిధి)-** ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు త్వరితగతిన అమలు చేస్తున్నది.ఆ క్రమంలోనే మరొక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.అదే పేదలకు ఉచిత సన్న బియ్యం పథకం.మండల కేంద్రంతో పాటు లోపలి మాచినేనిపేట లో బుధవారం వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ పథకాన్ని ప్రారంభించారు. రేషన్ కార్డు లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా స్వయంగా సన్నబియ్యన్ని పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ నిరంకుశ పాలనకు చరమగీతం పాడి మార్పు కోసం ఇందిరమ్మ రాజ్యాన్ని ఏర్పాటు చేయుటలో తెలంగాణ ప్రజల సంకల్పం గొప్పదని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి సహకరించకున్న హామీల అమలకు కృషి చేస్తున్నామని చెప్పారు.అనంతారం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్ట్ క్రింద ఎంపిక చేసి దాదాపు 80 ఇండ్లు ప్రారంభించామని అన్నారు.త్వరలో మండలంలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు,రేషన్ కార్డులు ఇస్తామని అన్నారు.రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ,మహిళలకు ఉచిత బస్ ప్రయాణం,గృహజ్యోతి పథకం క్రింద ఉచిత విద్యుత్,వంట గ్యాస్ రాయితీ,నిరుద్యోగులకు 55 వేల పై ఉద్యోగాల భర్తీ,చేశామని తెలిపారు.రాజీవ్ యువ వికాసం పథకం ఎస్సీ ఎస్టీ బీసీ యువతకు వరమని అన్నారు.ప్రజలు ఇందిరమ్మ రాజ్యాన్ని ఆశీర్వాదించాలని కోరారు. ఆయా కార్యక్రమాలలో తాహసీల్దార్ స్వాతి బిందు,ఆర్ ఐ ఆది నారాయణ,ఎం పి ఓ తులసీ రాం,కాంగ్రెస్ పార్టీ నాయకులు లేళ్ల వెంకట రెడ్డి,మంగిలాల్,సపావట్ నరేశ్,మల్లెల నాగేశ్వరరావు,దారావత్ రాంబాబు, దొండపాటి వాసు,వేల్పుల నరసింహారావు, పొన్నెకంటి సతీష్,లచ్చునాయక్,పాపిన్ని జనార్ధన్,రోకటి సురేష్,రాంబాబు,ప్రియాంక, లక్ష్మి,ఆర్కే నాయుడు,మిరియాల కిరణ్ కుమార్ డీలర్ లు బోడ వీరన్న,బాబులాల్,చంటి తదితరులు పాల్గొన్నారు

# ప్రశాంతంగా ముగిసిన పదవ తరగతి పరీక్షలు: ఎంఈఓ

**ఎరుపాలెం,నవభూమి,ఏప్రియల్ 2 :** మండలంలో మూడు పరీక్ష కేంద్రాల్లో జరిగిన పదవ తరగతి పరీక్షలు బుధ వారం జరిగిన సోషల్ పరీక్షతోప్రశాంతంగా ముగిశాయని ఎంఈఓ మురళీ మోహన రావు తెలిపారు.మండలంలో మొత్తం 466 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని అన్నారు.ఎర్రుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,గురుకుల పాఠశాల,బనిగళ్ళపాడు ఉన్నత పాఠశాల లలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఏ ఒక్క విద్యార్థి గైరుహాజరు కాలేదని 100% హాజరయ్యారని తెలిపారు.ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు జరగలేదని తెలిపారు.పరీక్ష కేంద్రాల వద్ద ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారని ఎంఈఓ తెలిపారు.



# వేసవి తాపాన్ని చల్లార్చేందుకు చలివేంద్ర కేంద్రాలు

## విరాళం అందజేసిన సేవ్ ఎ లైఫ్ (సేఫ్టీ ఫర్ హ్యూమానిటీ) సంస్థ అధ్యక్షుడు రాణా ప్రతాప్ సూరగన



**కూకట్‌పల్లి, ఏప్రియల్ 2, నవభూమి ప్రతినిధి:** వేసవి తాపాన్ని తట్టుకోలేక ఇబ్బంది పడే ప్రయాణికులకు, నడిచి వెళ్లే వాసులకు మానవతా హృదయంతో వసంత్ నగర్ కాలనీవాసులు సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కె పి హెచ్ బి డివిజన్ లోని వసంత్ నగర్ కాలనీ బస్ స్టాప్ దగ్గర ప్రతి వేసవి కాలంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. కాలనీవాసుల సహకారంతో, మహిళా మండలి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతోమందికి ఉపశమనం కలిగిస్తోంది. ఈ చలివేంద్రంలో దాతల సహకారంతో మంచినీరు, మజ్జిగ అందుబాటులో ఉంచారు. దీనిద్వారా ఎండలో ప్రయాణించే ప్రజలకు స్వల్ప విరామం, హాయిగా గళం తడుపుకునే అవకాశం లభిస్తోంది. ఈరోజు నిర్వహించిన కార్యక్రమంలో నిజాంపేట్ లోని ఏకే సి క్లాసెస్ (ఐఐటి ఇన్స్టిట్యూట్) సంస్థ తమ ఉదారతను చాటుకుంది. "సేవ్ ఎ లైఫ్ (సేఫ్టీ ఫర్ హ్యూమానిటీ)" సంస్థ అధ్యక్షుడు రాణా ప్రతాప్ సూరగన ద్వారా విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాణా ప్రతాప్ మాట్లాడుతూ. ఇలాంటి సేవా కార్యక్రమాల్లో భాగమవ్వడం ఎంతో సంతృప్తిని ఇస్తుందని, మానవతా దృక్పథంతో ప్రతి ఒక్కరూ తమకు తోచినంత సహాయాన్ని అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీమతి బాల, సుబ్బారావు దంపతులు, సీత మనోహరి తదితరులు పాల్గొని తమ సహాయాన్ని అందించారు. కాలనీవాసుల భాగస్వామ్యంతో నడుస్తున్న ఈ చలివేంద్రం ప్రజలకు మేలు చేసేందుకు మరింత ముందుకు సాగాలని నిర్వాహకులు ఆకాంక్షిస్తున్నారు

# హెచ్‌సియు విద్యార్థులపై దుర్మార్గంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదు

## ప్రభుత్వాన్ని హెచ్చరించిన జనసేన నాయకుడు ప్రేమ కుమార్



**కూకట్‌పల్లి, ఏప్రిల్ 2, నవభూమి ప్రతినిధి :** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల విక్రయంపై విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తుండగా, ప్రభుత్వం వారిపై నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తే ఊరుకోబోమని జనసేన పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇంచార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ హెచ్చరించారు. హెచ్ సి యు భూములను అమ్మితేనే ఖజానా నిండుతుందా? పర్యావరణ పరిరక్షణపై ప్రభుత్వానికి బాధ్యత లేదా? అంటూ ఆయన ప్రశ్నించారు. యూనివర్సిటీ భూముల కోసం పోరాడుతున్న విద్యార్థులపై విచక్షణారహితంగా లాఠీచార్జి చేయడం, వారిపై కేసులు నమోదు చేయడం దుర్మార్గమని అభివర్ణించారు. విద్యార్థులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలి. యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమి ఆక్రమణను తక్షణమే నిలిపివేయాలి. లేనిచో జనసేన ఉద్యమానికి సిద్ధమవుతుంది," అని ప్రేమ కుమార్ స్పష్టం చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల రక్షణపై విద్యార్థులు చేస్తున్న నిరసనలకు ప్రజా సంఘాలు మద్దతు తెలుపుతున్నాయన్నారు. ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకొని ఎడల విద్యార్థులు, కార్యకర్తలు, జనసేన నాయకులు కలిసి భవిష్యత్తులో ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామన్నారు.

# రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

- ఇల్లెందు ఎమ్మెల్యే కోరం, ఐడిసి చైర్మన్ మువ్వా
- ఇల్లెందులో ఘనంగా జై సంవిధాన్







**ఇల్లెందు ఏప్రిల్ 2 నవభూమి ప్రతినిధి:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున కార్గే, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డు నందు నిర్వహించారు. బుధవారం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఐ డి సి చైర్మన్, ఇల్లందు నియోజకవర్గ ఇంచార్జీ మువ్వ విజయబాబు, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య లు హాజరయ్యారు. ఈ కార్యక్రమం ప్రారంభం ముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతం ఆలపించారు. అనంతరం కార్యక్రమంలో వారు మాట్లాడుతూ భారతదేశం నేడు విపత్కర పరిస్థితులు ఎదుర్కొంటుంది. గత 10 ఏళ్లకు పైగా దేశాన్ని పాలిస్తున్న బిజెపి రాజ్యాంగాన్ని అవమాన పరుస్తూ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ అప్రజస్వామ్య పాలన సాగిస్తుందని అన్నారు. రాజ్యాంగం ప్రకారం ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడుతూ, గౌరవిస్తూ పాలన చేయాల్సిన పాలకులు నేడు వ్యవస్థలను నాశనం చేస్తూ తమ ఆధీనంలోకి తీసుకొని ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాలరాస్తున్నారని అన్నారు. దేశ ప్రజలకు సమాన హక్కులు, సమన్యాయం కల్పించాల్సిన పాలకులు రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛను కాలరాస్తున్న నేటి బిజెపి పాలకుల తీరు తీవ్ర ఆక్షేపానియంగా ఉంది. రాజ్యాంగం ఇచ్చిన మత స్వేచ్ఛను కాలరాస్తూ కట్టు, బొట్టు, తిండి, పూజ అన్నిటి పైన ఆంక్షలు పెడుతూ ప్రజల హక్కులను భంగం కలిగిస్తున్నారు. ఇలాంటి తరుణంలో రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క భారతీయుడు పైన ఉన్నది. అందుకే మన రాజ్యాంగాన్ని కాపాడుకుందాం... మనకు అహింస, శాంతి సిద్ధాంతాలను అలవర్చిన మహాత్ముని స్మరించుకుందాం, రాజ్యాంగాన్ని రచించి ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా అందరికీ సమాన హక్కులు కల్పించిన రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆలోచనలను కాపాడుకుందాం, అందుకే జై బాబు... జై భీమ్... జై సంవిధాన్ నినాదాలతో ఉద్యమిద్దాం అని తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం మూడో వార్డు నందు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ఏఎంసీ తాజా మాజీ చైర్మన్లు, డైరెక్టర్లు, ఇల్లందు మున్సిపల్ మాజీ చైర్మన్లు దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, యదల్లపల్లి అనసూర్య, మాజీ ప్రజా ప్రతినిధులు, నియోజకవర్గంలోని అన్ని మండలాల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, నియోజకవర్గ నాయకులు, నియోజకవర్గ మహిళా నాయకురాలు, విద్యార్థి విభాగం, ఐ ఎన్ టి యు సి నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు కార్యకర్తలు, ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల నాయకులు, పట్టణ మహిళా కమిటీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు

# ఆత్మగౌరవానికి, ధీరత్వానికి, ప్రతీక సర్దార్ పాపన్న

- కాంగ్రెస్ నాయకులు కాసాని నాగప్రసాద్



**కొత్తగూడెం ఏప్రిల్ 2 నవభూమి ప్రతినిధి:** దమ్మపేట మండలం,దురదపాడు గ్రామంలో కాసాని మంగేశ్వరావు, నాగప్రసాద్ సోదరుల నివాసం ఎదురుగా తాటివనంలో తెలంగాణ చత్రపతి శివాజీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ వర్ధంతి సందర్భంగా నాగుపల్లి, దమ్మపేట గ్రామాలకు చెందిన గౌడ బంధువులతో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పటాన్ని కి పూలమాల వేసి, పుష్పాంజలి బుధవారం ఘటించారు. ఈ సందర్భంగా కాసాని నాగప్రసాద్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆత్మగౌరవానికి, ధీరత్వానికి, ప్రతీక అని, తెలంగాణ బహుజన వీరుడని, రాజకీయ, సామాజిక సమానత్వం కోసం పాపన్న చేసిన కృషి ఎనలేనిది అని. సర్వాయి పాపన్న గొప్పతనాన్ని చాటడానికి ప్రతి సంవత్సరం వారి వర్ధంతి, జయంతి రోజున ఆ మహనీయుని స్మరించుకొని, పాపన్న ను ఆదర్శంగా తీసుకొని సమాజంలోని సామాజిక వర్గాలతో కలిసిమెలిసి సంతోషంగా జీవించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట మండల కాంగ్రెస్ నాయకులు కాసాని మంగేశ్వరరావు,నాగప్రసాద్, వంగల రాంబాబు,జై గౌడ్ సేన రాష్ట్ర కమిటీ సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్,తెలంగాణ ఆయిల్ ఫెడ్ జిల్లా ఇంచార్జీ నాయుడు రాధాకృష్ణ, నాగుపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు మారగాని నాగేశ్వరరావు, నాయుడు సతీష్, మిడత శ్రీను, అశ్వారావుపేట గౌడ సంఘం సభ్యులు కౌనకళ్ళ శ్రీను, పర్సా రామేశ్వరరావు, మిద్దె లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ బియ్యాన్ని అందజేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వాటా ఎంతనో చెప్పాలి

- వివేకానంద నగర్ డివిజన్ బిజెపి అధ్యక్షుడు డాక్టర్ వంశీ రెడ్డి



**కూకట్‌పల్లి, ఏప్రిల్ 02, (నవభూమి ప్రతినిధి) :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ బియ్యాన్ని అందజేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వారి వాటా ఎంతనో చెప్పాలని వివేకానంద నగర్ డివిజన్ బిజెపి అధ్యక్షుడు డాక్టర్ వంశీ రెడ్డి ప్రశ్నించారు. బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేషన్ షాపులలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫోటో ఏర్పాటు చేయకుండా, కేంద్ర ప్రభుత్వాన్ని నిందిస్తూన్న రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ పార్టీ నేతలు మాట్లాడడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి లబ్దిదారుడుకు కేంద్ర ప్రభుత్వం 20కిలోలు, రాష్ట్రం ప్రభుత్వం 4 కిలోలు అందజేస్తుంటే కాంగ్రెస్ పార్టీ నేతలు మాత్రం అంత మేమే ఇస్తున్నాం అని ప్రగల్భాలు పలుకుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా రేషన్ షాప్ నిర్వాహకులు మోడీ చిత్ర పటాన్నీ ఏర్పాటు చేయాలని లేదు అంటే, తానే ప్రతి రేషన్ షాప్ లో ఏర్పాటు చేస్తాం అని హెచ్చరించారు. మరో వైపు హెచ్.సి.యూ ఘటన పైన కూడా స్పందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పక్కా రాష్ట్రాలకు పర్యావరణ విపత్తులు గురించి గంటలు గంటలు మాట్లాడుతున్నాడని ఇక్కడ చెట్లు నరికితే తప్పు కదా అని విమర్శించారు. ప్రజలు కూడా ఈ విధ్వంసానికి ఎదురు తిరిగి కలిసి గట్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు నర్సింగ్ రావు, పాల్గొన్నారు